

నేటి దినపత్రిక


# సూర్య

www.suryaa.com

అన్నమయ్య

శుక్రవారం | 17 అక్టోబర్ 2025

పేజీలు 8


# హై హై నాయకా..

## అమాయకులను దోచుకో ఇక,,,

### మాయమాటలకు దొరికారంటే ఇక అంతే

-టిడిపి పార్టీనే ప్రధాన పెట్టుబడి,,,

-నిద్రావస్థలో అధిష్టానం

హై హై నాయకా అంటూ చుట్టూ భజన పరులను పెట్టుకొని టిడిపి పార్టీ బ్రాండ్‌ని చూపిస్తూ అమాయకులను నిలువునా ముంచేస్తున్నాడు ఒక టిడిపి ఘనుడు. అన్నమయ్య జిల్లాలో ఈయన గురించి చాలామంది నెత్తి నోరు బాదుకుంటున్న అధిష్టానం మాత్రం నిద్రావస్థలో ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఎందుకంటే అధిష్టానం దృష్టిలో ఆయన ఇచ్చిన బిల్డప్పు, ఎలివేషన్లు అలా ఉంటాయి. అయితే పార్టీని అడ్డం పెట్టుకొని ఇప్పటికే అనేకమంది పార్టీలో కొనసాగుతున్న వారికి , నమ్ముకున్న వారికి పంగ నామాలు పెట్టిన చరిత్ర ఈయనకుంది అని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. పైకి లీడర్‌గా లోపల గ్యాంబ్లర్ గా కొనసాగుతూ టిడిపి పతనానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తున్న ఈ నాయకుని అసలు బండారం అతి త్వరలోనే బాధితులు బయట పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం.

-పరిచయాలు సాకుగా చూపి దోచుకోవడమే పని,,

-వలలో పడ్డారో ఇక అంతే,,

-ఉండేది టిడిపిలో పనిచేసేది వైసీపీకి


-పైన లీడర్ లోపల గ్యాంబ్లర్




అన్నమయ్య జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్:

నమ్మిన వాళ్లది సులువుగా మోసం చేయొచ్చు, అలాగే పార్టీని కులాన్ని అడ్డం పెట్టుకొని మందిని ముంచి, పార్టీలోని పెద్దలతో పరిచయాలు పెంచుకొని ఎంతమందిని ముంచినా నాకేమీ అందుకునే ఒక టిడిపి నాయకునీ బండారం బయటపెట్టేందుకు ఆయన బాధితులు అన్ని ఆధారాలతో సిద్ధమయ్యారు. ఎవరైనా పార్టీకి సంబంధించి పదవిలో, అవకాశాలు అడిగితే ఈయన గారు ఉన్న కాడికి వారి వద్ద నుంచి దోచుకోవడం,

మిగతా 2లో






# మట్టి మాఫియా మింగేస్తోంది

-చెరువుల కడుపు కోసే దందా

-ఏజెన్సీ చట్టాలపై మాఫియా పంజా

-ప్రశ్నిస్తే దాడులు..

-మట్టి దోపిడీకి హద్దు లేదు

వీరబల్లి, మేజర్ న్యూస్: వీరబల్లి మండలం సోమవారం గ్రామం తిమ్మారెడ్డి కుంటలో మట్టి మాఫియా దౌర్జన్యం రోజురోజుకీ పెరుగుతూ ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ అనుమతులు, పరిమిషన్లు ఏవీ లేకుండానే, సంబంధిత శాఖలకు చెప్పకుండానే, కొందరు నాయకుల పేరుతో "మేము మాట్లాడుకున్నాం. అన్నీ సర్దుకున్నాం" అంటూ బహిరంగంగానే మట్టిని దోచేస్తున్నారు. చెరువుల గర్భభాగంలో జెసిబిలు దింపి ఎర్రటి మట్టిని తవ్వి, ట్రాక్టర్లలో ఎక్కించి, అధిక ధరలకు అమ్ముతున్నారు. ఆసుపాకతో పాటు అనేక రైతుల గ్రామాలు ఈ దోపిడీకి వేదికవుతున్నాయి. చెరువుల మట్టిని

మిగతా 2లో

## శస్త్ర చికిత్సలో ప్రభుత్వ వైద్యులు

# మరో ముందడుగు

-జనరల్ అనస్తీషియా ద్వారా థైరాయిడ్ శస్త్ర చికిత్స

-గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక ఆపరేషన్లు విజయవంతం

-ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు వినియోగించుకోవాలి

-థైరాయిడ్ శస్త్ర చికిత్స విజయంతం

-విలేకరుల సమావేశంలో సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్

2లో..



## గంగమ్మను దర్శించుకున్న యల్లటూరు



**రాజంపేట, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కొత్త బోయినపల్లి గ్రామంలో శ్రీ గంగమ్మ దేవస్థానం నందు ఎంతో ప్రతిష్టాత్మకంగా శ్రీ గంగమ్మ జాతర ఉత్సవం నిర్వహించారు. ఈ జాతరకు నిర్వాహకులు, గ్రామస్తులు, స్థానిక జనసేన నాయకుల ఆహ్వానం మేరకు గురువారం జనసేన నేత యల్లటూరు శ్రీనివాస రాజు జాతర మహోత్సవంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యల్లటూరు మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మేరువ సుబ్బరాయుడు, మేడా జానకి రామయ్య, నల్ల బాబు, బొడిచెర్ల సుబ్బరాయుడు, పొట్టు శంకరయ్య, మేడా శ్రీకాంత్, ద్వారక మరియు రాజంపేట జనసేన నాయకులు, మాజీ జెడ్పిటిసి యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మౌలా, గాజుల కులాయప్ప, గూడూరు శ్రీనివాసులు, వెలిగండ్ల శ్రీనివాసరాజు, సాయిరాజు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకమాసానికి ముస్తాబవుతున్న శివాలయాలు

**-కొండ కోనల నడుమ వెలసిన కర్కాటేశ్వ రా ఆలయం**

**-నెల రోజులపాటు కార్తీక మాసం పూజలు**



**చిట్వేలి, మేజర్ న్యూస్:** హిందువులకు అత్యంత భక్తి పరమైన మాసంగా కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాలు ముస్తాబ్ అవుతున్నాయి. ఇందులో భాగంగా ముఖ్యంగా కార్తీక మాసంలో అయ్యప్ప మాలలు వేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. శివాలయాలు దర్శనార్థం భక్తుల తాకిడి అధిక సంఖ్యలో ఉంటుంది కనుక ఆలయ నిర్వహకులు శివాలయాన్ని నూతనంగా రంగవల్లులు దిద్దుతూ ఆలయాలకు రంగులు వేస్తూ ముస్తాబు చేస్తున్నారు. కొండ కోనల మధ్య వెలసిన కర్కాటేశ్వర ఆలయం అడవి తల్లి ఒడిలో ఉన్న విధంగా జలపాతాల నడుమ ఆలయం దర్శనమిస్తుంది. ప్రత్యేకంగా భక్తులకు కర్కాటక రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చే మహాభాగ్యం అక్కడ మాత్రమే దొరుకుతుంది. అత్యంత పురాతనమైన ఆలయాలు చిట్వేలి మండలంలో ఉన్నందున విశేష శిల సంపద ఆలయాలకు ప్రతిరూపాలుగా మారాయి. భక్తుల సౌకర్యార్థం అన్ని శివాలయాలలో ఏర్పాటుకు అన్ని సమకూరుస్తున్నారు. భక్తుల తాకడిని దృష్టిలో పెట్టుకొని ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా చేపట్టారు. భద్రకాళి సమేత వీరభద్ర స్వామి, ఆలయం భువనేశ్వరి శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామి, ఆలయం లో నెలరోజులపాటు విశేష పూజలు నిర్వహిస్తారు. ఉభయ దాతలు ఇచ్చే అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఆలయ నిర్వహకులు తెలియజేశారు.

# శస్త్ర చికిత్సలో ప్రభుత్వ వైద్యులు మరో ముందడుగు



రాయచోటి ప్రతినిధి, మేజర్ న్యూస్ : రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు శస్త్ర చికిత్సలో మరో ముందడుగు వేశారని చెప్ప వచ్చును. సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, సివిల్ సర్జన్ స్పెషలిస్టు అనస్తీషియా డాక్టర్ వెంకట శివలు రాయచోటికి చెందిన శారదమ్మకు జనరల్ అనస్తీషియా ఇచ్చి థైరాయిడ్ శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గురువారం నాడు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ థైరాయిడ్ గ్రంథి అనేది మెడ మధ్య స్వరపేటిక క్రింద భాగాన, కాలర్ ఎముక పైన సీతాకోక చిలుకను పోలిన ఆకారంలో ఉంటుందన్నారు. ఈ గ్రంధి మన శరీరం పనితీరుకు అవసరమైన హార్మోన్లను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఈ గ్రంథి ద్వారా స్రవించే హార్మోన్ల కారణంగానే మానవ శరీరంలో జీవక్రియలు, అభివృద్ధి సక్రమంగా జరుగుతా యన్నారు. థైరాయిడ్ గ్రంథిలో ఏదైనా సమస్య ఏర్పడితే అది మొత్తం శరీర విధులను ప్రభావితం చేస్తుందన్నారు. థైరాయిడ్ వ్యాధి ఒక దీర్ఘ కాలిక సమస్య అని, ఈ వ్యాధితో బాధపడే వారు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కో వాల్సి ఉంటుందన్నారు. థైరాయిడ్ వ్యాధి అనేది వయస్సుతో సంబంధం లేకుండా ఎవరికైనా రావచ్చు అని, ముఖ్యంగా ఈ సమస్య మగవారి కంటే ఆడవారిలోనే దాదాపు రెండింతలు ఎక్కువగా ఉంటుందన్నారు. ఈనెల 13వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రిలో శారదమ్మ అనే మహిళకు జనరల్ అనస్తీషియా ఇచ్చి థైరాయిడ్ శస్త్ర చికిత్స విజయవంతం చేశామన్నారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో అనేక సర్జరీలు చేశామన్నారు. ప్రతి రోజు సర్జరీలు చేస్తూ నెలకు సుమారుగా 100 ఆపరేషన్లు చేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఈ ఆపరేషన్లు అన్నీ స్పెయిన్ అనస్తీషియా ఇచ్చి చేసే వాళ్ళ మన్నారు. కానీ రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి చరిత్రలో మొట్టమెదటి సారిగా జనరల్ అనస్తీషియా ఇచ్చి థైరాయిడ్ శస్త్ర చికిత్స చేసినట్లు ఆయన తెలిపారు. ఇటువంటి జనరల్ అనస్తీషియా ఇచ్చి చేసే సర్జరీలు పెద్ద పెద్ద ఆసుపత్రులలో చేయడం జరుగుతుందన్నారు. డాక్టర్ శైలేష్ శరదమ్మ అనే పేషెంట్ ను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని రావడం జరిగిందని, అన్ని పరీక్షలు నిర్వహించి థైరాయిడ్ సమస్యను గుర్తించి ఆపరేషన్ చేయాలని సూచించడం జరిగిందన్నారు. శారదమ్మ గత 4 సంవత్సరాల నుంచి గొంతులో థైరాయిడ్ గడ్డతో ఇబ్బంది పడుతుండేదన్నారు ఈమెకు అన్ని పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ గడ్డ కాదని నిర్ధారించు కున్న తర్వాతనే ఈ ఆపరేషన్ చేసినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా సర్జరీ ముందు రోగికి ఆపరేషన్ తర్వాత వచ్చే నష్టాలను గురించి వివరించడం జరిగిందన్నారు. ఈఎన్ టి డాక్టర్ నరసింహా, అనస్తీషియా వైద్యులు డాక్టర్ వెంకట శివతో కలసి సుమార మూడు గంటల పాటు శ్రమించి ఆపరేషన్ ను విజయవంతం చేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన మందులు లేకున్నా భయటి ప్రాంతాల నుంచి తెప్పించి ఆపరేషన్ విజయవంతానికి కృషి చేసిన అడ్మిషన్ విభాగానికి, ఫార్మసి విభాగానికి ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ అనస్తీషియా డాక్టర్ వెంకట శివ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పెద్ద ఆపరేషన్ చేయించుకున్న శారదమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. థైరాయిడ్ సర్జరీని విజయవంతం చేశామన్నారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండే సదుపాయాలను రాయచోటి ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని ఆయన సూచించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ డెవిడ్ సుకుమార్ మాట్లాడుతూ రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో జనవరి నుంచి అక్టోబర్ వరకు సుమారు 760 ఆపరేషన్లు చేసినట్లు ఆయన తెలిపారు. అందులో జనరల్ అనస్తీషియా ఇచ్చి థైరాయిడ్ ఆపరేషన్ను సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ నిర్వహించడం చాలా గర్వంగా ఉందన్నారు. ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి మెరుగైన వైద్య సేవలను వినియోగించు కోవాలని సూచించారు. అదే విదంగా ప్రభుత్వ ఆసుపతి ఆర్ఎంవో డాకర్ బండారు కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి చరిత్రలో జనరల్ అనస్తీషియా ఇచ్చి ఆపరేషన్ చేయడం ఇదే ప్ర ధమం అన్నారు. ఈ ఆపరేషన్ ప్రైవేటు ఆసుపత్రిలో చేయించుకుంటే లక్ష రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. అంతే కాకుండా ఈ ఆపరేషన్ చాలా కష్టంతో కూడుకున్న పని అన్నారు. గతంలో సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ అనేక ఆపరేషన్లు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ డెవిడ్ సుకుమార్, సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ కిరణ్ కుమార్, సివిల్ సర్జన్ స్పెషలిస్టు అనస్తీషియా డాక్టర్ వెంకట శివ, ఆనస్తీషియా డాక్టర్ అనిల్ కుమార్, నర్సింగ్ సూపరింటిండెంట్ పద్మావతి, హెడ్ నర్సు విజయ కుమారి, స్టాఫ్ నర్సులు కమల, ప్రసన్న, సోని, నాగలక్ష్మీ, ఓటి అసిస్టెంట్లు తులసి, నాగేశ్వరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి మాఫియా మింగేస్తోంది



**(మొదటి పేజీ తరువాయి)**కూడా వదలకుండా కాజేసి, దాన్ని 'కాంట్రాక్టు' పేరుతో నగదు చేసుకుంటున్నారు. ఈ మట్టి దందాలో కొందరు అమాయక రైతులను వశపరచుకొని, వారి పేరుతో చట్టవిరుద్ధ పనులు చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంత నిబంధనలను తుంగలో తొక్కుతూ, రైతుల హక్కులను పక్కనబెట్టి ఈ మాఫియా స్వైరవిహారం చేస్తోంది. ప్రశ్నిస్తే బెదిరించడం, దాడులకు దిగడం, గ్రామాల్లో విభేదాలు లేపడం వీరి యధావిహిత పద్ధతి. ఆదివారం సోమవారం అనేక చోట్ల ఇష్టానుసారంగా కాంట్రాక్టులు కుదుర్చుకొని, ట్రాక్టర్ల దండుతో మట్టిని తరలించారు. గ్రామస్తులు అవడానికి ప్రయత్నిస్తే "నాయకులతో మాట్లాడుకున్నాం" అని, లేదా "మీకు మేలు చేస్తాం" అని మోసపూరిత హామీలు ఇస్తున్నారని స్థానికులు చెబుతున్నాయి"ఇలా కొనసాగితే రాబోయే సంవత్సరాల్లో చెరువులు శూన్యమవుతాయి, నీటి కొరతతో పంటలు నాశనమవుతాయి. భూగర్భ జలాలు తగ్గిపోతాయి, మన భవిష్యత్తు చీకట్లో మునిగిపోతుంది." సంబంధిత శాఖ అధికారులను చరవాణిలో సంప్రదించగా అందుబాబులో లేరు, అధికారులు, రాజకీయ నాయకుల మౌనం చర్యలు లేకపోవడం మాఫియాకు మరింత బలం ఇస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నాడు. "ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ మట్టి దందాలను తక్షణమే ఆపాలి. వెరువుల మట్టిని మింగేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మా చెరువులు, మా భూములు కాపాడక పోతే మేమే రోడ్డెక్కుతాం" అని రైతులు నులు ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరిస్తున్నారు.

# హై హై నాయకా,,

**(మొదటి పేజీ తరువాయి)**తరువాత ముఖం చాటేయడం, ఇదేమని అడిగితే బెదిరించడం భయపెట్టడం ఇతని దినచర్యగా మారిపోయింది. ఇలా నమ్మి మోసపోయిన వారు తమ సర్వస్వం కోల్పోయి రోడ్డును పడితే ఈయన మాత్రం అందులో దోచుకున్నది సొమ్ము చేసుకుంటూ, పార్టీ అధిష్టానం వద్ద ఎంతో కొంత ఖర్చు పెడుతూ దేశ నాయకుడిగా చలామణి అవుతూ ఇప్పుడు అనేక ప్రాంతాలలో వైసిపికి నమ్మిన బంటుగా, వారి అవసరాలు తీర్చే వ్యక్తిగా పేరు గడించాడు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చినప్పటి నుండి తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు పంగనామాలు పెడుతూ వైసిపి డైరెక్షన్లో పనిచేస్తూ పసుపు కండువా కప్పుకుని వైసిపి నాయకులపై ఈగ వాల కుండా సెటిల్మెంట్లు చేస్తూ వారికి అన్ని విధాల చేదోడు వాదోడుగా ఉంటున్నారని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఇతను నమ్మి అనేకమంది రోడ్డు పాలు అయితే, ఈయన మాత్రం తెలుగుదేశం పార్టీని భ్రష్టు పట్టించేలా ఒక పథకం ప్రకారం వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

**సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి డబ్బు సాయం,,**

గడచిన ఎన్నికల్లో వైసీపీకి నగదు సాయం చేసిన ఘనత కూడా ఈయనకే దక్కింది. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పని చేస్తున్నారనే బిల్డప్లు ఇస్తూ లో లోపల వైసీపీ వారికి కోట్ల రూపాయల నగదును సరఫరా చేసిన ఘనత కూడా ఈ నాయకుడికే చెందుతుంది.

ప్రస్తుతం ఈ నాయకునికి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కంటే వైసీపీ నాయకులు కార్యకర్తలలోనే మంచి క్రేజ్ ఉందని, వారికోసం వారి ఇబ్బందులు తొలగించేందుకు తెలుగుదేశం వారిపై కూడా దౌర్జన్యానికి దిగే అంత సత్తా ఈ వ్యక్తి ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గాలలో తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఇన్చార్జులు పార్టీని గాడిన పెట్టే లా పనిచేస్తుంటే, అధిష్టానం వద్ద తమ పరిచయాలను, పలుకుబడిని సాకుగా చూపి టిడిపి ముసుగులో వైసీపీకి ప్రధాన బలగంగా పనిచేస్తున్న ఈ నకిలీ నాయకుని పై అతి త్వరలోనే పూర్తి ఆధారాలతో బండారం బయట పెట్టేందుకు బాధితులు సిద్ధమయ్యారు. ఇప్పటికే పథకం ప్రకారం నియోజకవర్గంలో ఇతను చేసే అరాచకాలకు సొంత సామాజిక వర్గం వారు కూడా తలలు పట్టుకునే పరిస్థితి. మరి చూడాలి తప్పు చేస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని చెప్తున్న టిడిపి అధిష్టానం మరి ఇతను చేసినా రాజకీయాలపై ఆధారాలతో సహా బాధితులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటుందో లేదో,,




## ప్రధానమంత్రి పర్యటనకు కలకడ నుండి 40 మంది

**కలకడ, మేజర్ న్యూస్:** సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమము లో భాగముగా గౌరవ ప్రధానమంత్రి మోదీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం కర్నూలు పర్యటన లో బాగంగా కలకడ మండలము నుండి 40 మందితో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బస్ ఈ రోజు ఉదయం 6:45 కు కలకడ మండల పరిషత్ కార్యాలయము నుండి బయల్దేరడము జరిగింది. బస్ నందు వెలుగు శాఖ నుండి సంఘమిత్ర లీడర్స్ 24 మంది, హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్ శాఖ నుండి 9 మంది, ఎంపిడిఓ కార్యాలయం, రెవెన్యూ శాఖ నుండి 6 మంది, పోలీసు (హోమ్ శాఖ)వారి నుండి ఒకరు మొత్తము 40 మందితో బయల్దేరడము జరిగింది. ప్రధాన మంత్రి కార్యక్రమము కు కర్నూలు వద్ద గల నన్నూరు వద్దకు వీరు చేరుకోవడం జరుగును. ఈ సందర్భంగా బస్ జెండా ఊపి కార్యక్రమము కు ఆహ్వానము పలికారు. ఇందులో ఎంపిడిఓ, శ్రీ భాను ప్రసాద్, ఏపిఎం పురుషోత్తం రెడ్డి , డిప్యూటీ ఎంపిడిఓ(ఇంచార్జి) శైలజ, ఎంపిడిఓ కార్యాలయం సిబ్బంది, హోమ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## గద్దలరేవుపల్లిలో నూతన కిసాన్ స్మార్ట్‌ను ప్రారంభించిన ముక్కా వరలక్ష్మి





**ఓబులవారిపల్లె మేజర్ న్యూస్:** ఓబులవారిపల్లి మండలం గద్దలరేవుపల్లి గ్రామం చిట్వేల్ రోడ్ దారిలో ఏర్పాటు చేసిన కిసాన్ స్మార్ట్ స్టోర్‌ను నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇంచార్జి కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.డాక్టర్ వెంకటేశ్వర్లు ఏదోటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కిసాన్ స్మార్ట్ స్టోర్ యాప్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నాయి. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ ప్లాట్‌ఫారమ్ ద్వారా రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పంటల మార్కెట్ ధరల సమాచారాన్ని సులభంగా పొందగలరు. అనంతరం ముక్కా వరలక్ష్మి మాట్లాడుతూ రైతుల అభివృద్ధి, సాంకేతిక ప్రగతి లక్ష్యంగా తీసుకున్న ఈ కొత్త ప్రయత్నం గ్రామీణ వ్యవసాయ రంగానికి దోహదం చేస్తుంది. అన్ని రంగాలతో పాటు వ్యవసాయ రంగంలో కూడా టెక్నాలజీ అభివృద్ధి చెందడం రైతులకు ఎంతో మేలు చేస్తుంది. ఇటువంటి వినూత్నమైన సేవలు అందిస్తుంది. డాక్టర్ వెంకటేశ్వర్లు వంటి ఔత్సాహికుల అవసరం ప్రస్తుత సమాజానికి ఎంతో ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చిట్వేల్, ఓబులవారిపల్లి, రైల్వే కోడూరు నియోజకవర్గాల కూటమి నాయకులు తో పాటు రైతులు, స్థానిక ప్రజలు పాల్గొని కిసాన్ స్మార్ట్ ప్రారంభాన్ని అందరూ స్వాగతించారు.



# ఘనంగా అంతర్జాతీయ మత్తుమందు దినోత్సవం

**-అనస్థీషియా డాక్టర్లను అభినందించిన పలువురు**

**-మత్తుమందు ప్రాముఖ్యతను వివరించిన డాక్టర్లు**



**రాయచోటి ప్రతినిధి, మేజర్ న్యూస్:** రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం అంతర్జాతీయ మత్తుమందు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ అనస్థీషియా డాక్టర్ వెంకట శివ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డెవిడ్ సుకుమార్, సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి సిఎంవో డాక్టర్ కిరణ్ కుమార్, అనస్థీషియా డాక్టర్ అనిల్ కుమార్, వైద్య సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ అనస్థీషియా డాక్టర్ వెంకట శివ మాట్లాడుతూ 1837%-%1901 విక్టోరియన్ కాలంలో ఆపరేషన్ అంటే భరించరాని నొప్పితో అత్యంత క్రూరంగా ఉండేదన్నారు. అంతే కాకుండా అదొక మరణ శాసనంగా ఉండే దన్నారు. బ్రిటన్ కు చెందిన సర్జన్ రాబర్ట్ లిస్టన్ 1840లో లండన్లోని యూనివర్శిటీ కాలేజ్ ఆసుపత్రిలో చేరి కేవలం 25 సెకన్లలోనే ఆపరేషన్లు చేసే వారన్నారు. వేగంగా ఆపరేషన్లు చేసి విజయం సాధించడంలో ఆయన మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. శస్త్రచికిత్స సమయంలో నొప్పితో అరుస్తున్న రోగులను అక్కడుండే సహాయ కులు చెక్క బల్లకు అదిమి పట్టు కునే వారన్నారు. ఎందుకంటే ఆ రోజుల్లో నొప్పిని తగ్గించే మందులు లేవని, వేగంగా ఆపరేషన్లు చేయడం వల్ల రోగులు భయంకర మైన నొప్పిని అనుభవించే సమయం తగ్గుతుందన్నారు. అనంతరం 1845 లో హొరేస్ వెల్ అనే దంత వైద్యులు నైట్రస్ ఆక్సైడ్ గ్యాస్ ఉపయోగించి నొప్పి లేకుండా రోగి పన్ను తొలగిస్తానని బోస్టన్ లో ఒక ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారని కానీ ఆ ప్రయత్నం విఫలం అయిందన్నారు. అనంతరం 1846 అక్టోబర్ 16వ తేదీన విలియం మోర్టన్ అనే దంత వైద్యుడు బోస్టన్ నగరంలో అనస్థీషియాపై ప్రదర్శన ఏర్పాటు చేశారని, అందుకు ప్రతి ఏటా అక్టోబర్ 16వ తేదీని ప్రపంచ అనస్థీషియా దినంగా జరుపు కుంటున్నామన్నారు. అనస్థీషియా అనేది నొప్పిలేకుండా చేసే ప్రక్రియలను నిర్వహించడానికి వీలు కల్పిస్తుందన్నారు. అనస్థీషియాలో మూడు ప్రధాన రకాలు ఉన్నా యని, వాటిలో ఒకటి లోకల్ అనస్థీషియా, రెండు రీజినల్ అనస్థీషియా, మూడు జనరల్ అనస్థీషియా వివరించారు. వీటిలో ఒక్కో రకమైన శస్త్ర చికిత్స చేసే సమయంలో ఒక్కో రకమైన అనస్థీషియా ఇస్తామన్నారు. సాధారణంగా ప్రభుత్వ ఆసుపత్రులలో లోకల్ అనస్థీషియాను ఉపయోగిస్తా మన్నారు. లోకల్ అనస్థీషియాలో లిడోకాయిన్ వంటి మందులను సూది ద్వారా ఇంజెక్ట్ చేసి ఆ ప్రాంతాన్ని తిమ్మిరి చేసి లోతైన కోతను, కుట్టడం ప్రక్రియలకు స్థానిక అనస్థీషియా తగినంత నొప్పి నివారణను అందిస్తుందన్నారు. ఇకపోతే రెండవది జనరల్ అనస్థీషియా. ఈ జనరల్ అనస్థీషియాలో ఔషధాన్ని శరీరాన్ని ప్రభావితం చేసే సిరలలోకి ఇంజెక్షన్ ద్వారా ఇస్తారని తెలిపారు. దీంతో రోగి పూర్తిగా అపస్మారక స్థితికి చేరు కుంటారన్నారు. ముఖ్యంగా గుండె శస్త్రచికిత్స, మెదడు శస్త్రచికిత్స, సంక్లిష్టమైన శస్త్రచికిత్సలలో ఈ జనరల్ అనస్థీషియాను ఉపయో గిస్తారని తెలిపారు. ఇక మూడవది రీజినల్ అనస్థీషియా. ఈ రకమైన అనస్థీషియాలో శరీరంలోని చాలా భాగం మొద్దుబారిపోతుందన్నారు. కాలు లేదా చేతికి చేసే శస్త్ర చికిత్సలు, పెద్ద శస్త్రచికిత్సల సమయంలోనే దీనిని వినియోగి స్తారన్నారు. ఇందులో ఔషధాన్ని వెన్నుపాము చుట్టూ ఉన్న పెద్ద నరాల లోకి లేదా సమీపంలోకి ఇంజెక్ట్ చేస్తారన్నారు. అనంతరం ప్రపంచ మత్తుమందు దినోత్సవం సందర్భంగా భారీ కేక్ ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్య క్రమంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ డెవిడ్ సుకుమార్, సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ కిరణ్ కుమార్, అనస్థీషి యా డాక్టర్ అనిల్ కుమార్, నర్సింగ్ సూపరింటిండెంట్ పద్మావతి, హెడ్ నర్సు విజయ కుమారి, స్టాఫ్ నర్సులు కమల, ప్రసన్న, సోని, నాగలక్ష్మీ, ఓటి అసిస్టెంట్లు తులసి, నాగేశ్వరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన వివాహిత మహిళ అనుమానాస్పద మృతి : ప్రజా సంఘాల ఆందోళన





**పీలేరు, మేజర్ న్యూస్:** బుధవారం సదుంమండల పరిధిలో చోటుచేసుకున్న వివాహిత మహిళ అనుమానాస్పద మృతి కలకలం రేపుతోంది. సదుం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కె. విజయ (45) బుధవారం ఉదయం మృతదేహంగా లభించారు. సమాచారం ప్రకారం మృతురాలు పీలేరు పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న శశి ఆర్థో హాస్పిటల్‌లో ఉద్యోగం చేస్తూ, మంగళవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరారు. అయితే బుధవారం ఉదయం స్వగ్రామం సమీపంలోని మామిడి తోటలో ఆమె మృతదేహం గుర్తించబడింది.మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె భర్త విదేశీ దేశమైన కువైట్‌లో పనిచేస్తున్నారు. తల్లి మృతి వార్తతో పిల్లలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం ఉదయం పీలేరు పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కిల్లా విజయ్ కుమార్, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పురుషోత్తం, గురునాథ్ తదితరులు మాట్లాడుతూ, “కొత్తకోట విజయ మృతి సహజం కాదని, ఆమెను హత్య చేసినట్లు అనుమానం కలుగుతోంది. పోలీసులు నిజాయితీగా దర్యాప్తు చేసి నిందితులను గుర్తించి కఠిన శిక్ష విధించాలి” అని డిమాండ్ చేశారు.అలాగే మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ఆమె ఇద్దరు కుమారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మృతురాలి కుటుంబ సభ్యులు, ప్రజా సంఘ నాయకులు, గిరిజన ప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మండలంలో క్షుద్రపూజ కలకలం

**సుండుపల్లె మేజర్ న్యూస్:** సుండుపల్లి మండల పరిధిలోని పోలిమేరపల్లి సమీపంలోని గుంతరాచపల్లి దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించినట్టు గ్రామస్తులు గుర్తించారు.పశువులను మేపడానికి వెళ్ళిన గ్రామస్తులు బూడిద, రంగు పొడి, కొబ్బరికాయలు, జుట్టు నింపిన సీసాలు వంటివి గమనించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు భయాందోళనలో చెందుతున్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నట్లు కొందరు వెల్లడించారు. స్థానిక అధికారులను వెంటనే విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



# మిట్స్ యూనివర్శిటీలో ఘనంగా ఐఈఈఈ డే-2025



**కురబలకోట,మేజర్‌న్యూస్ :** అంగళ్లు సమీపం లోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్),డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఐఈఈఈ డే-2025 వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సి.సమీర్,చైర్మన్,ఐఈఈఈ కమ్యూనికేషన్ సొసైటీ,వైజాగ్ విభాగం వారు వర్చ్యువల్ ఆన్లైన్ ద్వారా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలో ప్రపంచవ్యాప్తంగా ఈ వేడుకలను నిర్వహిస్తారని,ఐఈఈఈ సభ్యత్వం యొక్క ప్రాముఖ్యతను మరియు దాని యొక్క విస్తారమైన వృత్తిపరమైన ప్రయోజనాలను అధ్యాపకులకు వివరించారు.ఐఈఈఈ సభ్యత్వం ద్వారా వృత్తి పరమైన వృద్ధిని పెంపొందించడానికి విద్యార్థులు మరియుఅధ్యాపకులనుప్రోత్సహిస్తుందని, ప్రపంచ నిపుణులతో కనెక్ట్ అవ్వడానికి,అత్యా ధునిక పరిశోధనలను యాక్సెస్ చేయడానికి మరియు వివిధ అంతర్జాతీయ పరిశోధనలలో పాల్గొనడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. సాంకేతిక సంఘటనలు ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న ఇంజనీరింగ్,టెక్నాలజీ మరియు కంప్యూటింగ్ రంగాలలో సభ్యత్వం ఆవిష్కరణ, వృత్తిపరమైన అభివృద్ధి నాయకత్వ నైపుణ్యాలను ఎలా పెంపొందిస్తుందో ఆయన వివరించారు.ఈ యూనివర్సిటీకు 2015 నుంచి (ఐఈఈఈ) స్టూడెంట్‌చాప్టర్‌నుపొందిఉన్నదని,ఈ సందర్భముగా యాజమాన్యాన్ని అభినందించారు.అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రామనాథన్ మాట్లాడుతూ ఐఈఈఈసభ్యత్వంద్వారా,విద్యార్థులు స్కాలర్‌షిప్ లు,మెంటర్‌షిప్ అవకాశాలు మరియు పరిశోధన మరియు ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం (ఐఈఈఈ ఎక్స్‌ప్లోర్) వంటి వనరులను పొందవచ్చునన్నారు. మరోవైపు,ఫ్యాకల్టీ సభ్యులు విలువైన వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమాలు,సమావేశాలు మరియు ప్రపంచ ప్రఖ్యాత (ఐఈఈఈ) జర్నల్స్‌లో ప్రచురించగలసామర్థ్యాన్ని పొందుతారన్నారు.ఈ సందర్భంగా పేపర్ ప్రజంటేషన్,పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులుఅందజేశారు.ఈ కార్యక్రమంలో ఐఈఈఈ కో - ఆర్డినేటర్ డాక్టర్ సి.కుమార్ ,అధ్యాపకులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యమే మహాభాగ్యం



**పుల్లంపేట,మేజర్‌న్యూస్ :** పుల్లంపేట మండలం,దలవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో..నేడు ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఆరోగ్యకర ఆహారం,అనారోగ్యకర ఆహారము గురించి 1 వ తరగతి విద్యార్థులు వివిధ నమూనాలు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదు అని,చిన్నతనంనుండేఎలాంటిఆహారం తినాలి,ఎలాంటి ఆహారం తినకూడదో విద్యార్థులుఅవగాహన కలిగి ఉంటే,భవిష్యత్ లో మంచి ఆహారపు అలవాట్లు నేర్చుకుంటారు అని,జంక్ ఫుడ్ తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవలసిఉంటుందని,కావునఆకుకూరలు,పండ్లు,చిరుధాన్యాలు, వంటివి ఆహారంగా తీసుకుని ఆరోగ్యముగా ఉండాలని పేర్కొన్నారు.పిల్లలు చాలా చక్కగా నమూనాలు తయారు చేసినందుకు బహుమతులు అందించారు.

# వారధి ఫౌండేషన్ రాష్ట్రస్థాయి పరీక్షల్లో సంబేపల్లి విద్యార్థులు



**సంబేపల్లి మేజర్ న్యూస్ :** సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వారధి ఫౌండేషన్ వారు ఆన్లైన్ లో నిర్వహి oచిన వ్యాసరచన పోటీలలో ఆ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకర రామకృష్ణ తెలిపారు. డాక్టర్ మోహన్ కందా అధ్యక్షతన నిర్వహించబడుతున్న ప్రభుత్వేతర సంస్థ అయిన వారధి ఫౌండేషన్ వారు ప్రతి సంవత్సరం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయి,రాష్ట్రస్థాయి వార్షిక పోటీలను నిర్వహించి నగదు బహుమతిని ప్రధానం చేస్తారని అన్నారు. సంబేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన తరుణ్ కుమార్ గౌడ్, చిలకమ్మ, మౌనిక అను ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన 26 జిల్లాల నుండి అలాగే తెలంగాణ కు చెందిన 31 జిల్లాల నుండి మొత్తం 57 టీములు ఈ ఆన్లైన్ వ్యాసరచన పరీక్షలలో పాల్గొన్నట్లు తెలిపారు . వెబ్ కెమెరా పర్యవేక్షణలో ఆన్లైన్ పరీక్షలు జరిగాయని అన్నారు. వీరు ఆన్లైన్ ద్వారా సమర్పించిన వ్యాసరచనలను వారధి ఫౌండేషన్ వారు మూల్యాంకనం జరిపి రెండు రోజులలో విజేతలను ప్రకటించి నగదు బహుమతిని ప్రధానం చేస్తారన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ కోడింగ్, ఆంగ్ల భాష పై శిక్షణ ఇస్తారన్నారు.

# ప్రధాని మోడీకి వీడ్కోలు పలకడం గొప్ప గౌరవం

– ఏపీఐఐసీ డైరెక్టర్ డాక్టర్ మైఫోర్స్ మహేష్ హర్షం



**మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** కర్నూలులో జరిగిన సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ సభకు హాజరై,సభ ముగిసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోడీకి వీడ్కోలు పలికే అవకాశం తనకు లభించడం గొప్ప గౌరవమని అన్నమయ్య జిల్లా,మదనపల్లె పట్టణానికి చెందిన ఏపీఐఐసీ డైరెక్టర్ డాక్టర్ మైఫోర్స్ మహేష్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కర్నూలులో జరిగిన సభలో ప్రధాని నరేంద్ర మోడీ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,కూటమి ప్రముఖులని ఒకే వేదికపై చూడడం అద్భుత ఘట్టమన్నారు.ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో సభతో సభవిష్యత్తు అన్నరీతిలో సాగిందన్నారు.సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ కావడంతో ప్రజల జీవితంలో ఆనందం వెల్లివిరిస్తోందన్నారు. కూటమి పాలన పట్ల ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారనడానికే ఈ సభే నిదర్శనమన్నారు.రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోడీ అనేక అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడం శుభ పరిణామమన్నారు.రాష్ట్ర అభివృద్ధిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



**కేవిపల్లి మేజర్‌న్యూస్ :** అన్నమయ్య జిల్లా కె.వి. పల్లి, కలికిరిమండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో గురువారం ప్రజా సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. ప్రజలు సమర్పించిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించి సత్వర స్పందనతో పరిష్కార మార్గాలను చూపించాలని సూచించారు. ప్రజలు తీసుకొచ్చిన వివిధ అర్జీలను ఆయన స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులను సమస్య తెలియజేస్తూ పరిష్కార మార్గాన్ని చూపించారు. కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు గౌరవంగా పలకరించి వారి సమస్యలు విని అలసత్వం వహించకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తేనే ప్రజల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమాలు ప్రజలకు చేరే విధంగాఅధికారులు సమన్వయంతో పనిచేయాలని సమీక్షా సమావేశంలో ఆయన అధికారులను తెలియజేశారుముఖ్యంగా సచివాలయ సిబ్బందిని ఆయనప్రత్యేకంగాపలకరించారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలు రైతులు కూటమి నాయకులు కార్యకర్తల సమస్యలుతమపరిధిలో ఉన్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులకు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండవని దీన్ని గుర్తించాలని ఆయన కోరారు.



# ముక్కావారిపల్లెలో సిమెంట్ రోడ్డుకు భూమి పూజ : ముక్కా వరలక్ష్మి

**ఓబులవారిపల్లె మేజర్‌న్యూస్ :** ఓబులవారిపల్లి మండలంలోని ముక్కవారి పల్లి గ్రామంలో సిమెంట్ రోడ్ భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇంచార్జ్, కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి వారి కుమారుడు ముక్కా విశాల్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ కార్యక్రమాన్ని శుభప్రదంగా ప్రారంభించారు.గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు ఈ సిమెంట్ రోడ్ నిర్మాణం చేపట్టడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ప్రజల అవసరాలకు ఎల్లప్పుడూ అండగాఉంటామని ముక్కా వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా గ్రామస్తులు పాల్గొన్నారు.



# మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎఫ్‌డిపి పోస్టర్ విడుదల



**రాజంపేట,మేజర్‌న్యూస్ :** అన్నమాచార్య విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో "స్థిరత్వం వైపు మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఉద్భవిస్తున్న సాంకేతికతలు" అనే అంశంపై జాతీయ స్థాయి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్.డి.పి.) పోస్టర్‌ను అన్నమాచార్య విశ్వవిద్యాలయం ప్రో-చాన్సలర్ సి. అభిషేక్ రెడ్డి విడుదల చేశారు. విడుదల చేసిన మొదటి పోస్టర్‌ను అన్నమాచార్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డా. ఈ. సాయి బాబా రెడ్డి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో డా. ఎస్.ఎం. వి. నారాయణ, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ప్రిన్సిపాల్, డా. బి. జయరామి రెడ్డి, అన్నమాచార్య విశ్వవిద్యాలయం అడ్మిషన్ల డీన్, డా. జి. సురేశ్ బాబు, మెకానికల్ ఇంజినీరింగ్‌విభాగాధిపతి, అలాగే సమన్వయ కర్తలుడా.బి.దేవరాజ్ నాయక్ కె. అజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ ఆరు రోజుల జాతీయ స్థాయి ఎఫ్.డి.పి. కార్యక్రమం అన్నమాచార్య విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 3 నుండి 8 వరకు ఆన్‌లైన్ రూపంలో నిర్వహించబడనుంది.ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్లు దేశంలోని ప్రముఖ ఐఐటీలు మరియు ఎన్ఐటీలుకు చెందిన ప్రొఫెసర్లు మరియు పరిశ్రమ నిపుణులు పాల్గొననున్నారు. ఈ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా బోధకులు శక్తి నిల్వ వ్యవస్థలు, సి.ఎఫ్.డి. విశ్లేషణ, బయో పదార్థాలు, యంత్ర అధ్యయన అనువర్తనాలు, హైడ్రోజన్ ఇంధన సాంకేతికత, ఉష్ణ మార్పిడి, అదితివ్ తయారీ, మరియు ఏ.ఐ.ఎం.ఎల్. ఆధారిత తయారీ విధానాలు వంటి ఆధునిక సాంకేతిక అంశాలను లోతుగా నేర్చుకోనున్నారు. ఈ ఆధునిక పరిజ్ఞానం ద్వారా అధ్యాపకులు తమ బోధనలో సాంకేతికతను సమన్వయం చేసుకొని, విద్యార్థులకు ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అందించగలుగుతారు. ఫలితంగా విద్యార్థుల్లో పరిశోధనాభిరుచి, సాంకేతిక దృష్టి మరియు స్థిరమైన అభివృద్ధి పట్ల అవగాహన మరింతగా పెరుగుతుంది.

# ఆంధ్ర భద్రాద్రికి బస్టాండు గతి లేదా

▪ ఒంటిమిట్టలో బస్టాండు ఎక్కడో తెలియక విలవిలలాడుతున్న ప్రయాణికులు ▪ టాయిలెట్ల సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్న మహిళా ప్రయాణికులు







**ఒంటిమిట్ట,మేజర్‌న్యూస్** : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఏకశిలా నగరం ఒంటిమిట్టకు బస్ షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతు న్నారు.అంతేకాకుండా ఒంటిమిట్ట బస్టాండ్ లో టాయిలెట్ల సౌకర్యం లేక మహిళా ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసి బస్ డ్రైవర్లకు ఒంటిమిట్టలో బస్టాండ్ ఎక్కడో తెలియక ప్రతిచోటబస్సులను ఆపుతున్నారు. ప్రయా ణికులు బస్సు ఆగిన వెంటనే పరుగులు తీస్తు న్నారు వృద్దులు వికలాంగులు.అందులు. బస్సుల కోసం పడరాని పాటలు పడు తున్నారు రవాణా శాఖ మంత్రి. మండపల్లి రాంప్రసాద్ రెడ్డి ఒంటిమిట్ట బస్టాండ్ గురించి దృష్టిలో ఉంచుకుని ఆంధ్ర భద్రాద్రిగా పేరు గాంచిన ఒంటిమిట్టకు బస్టాండ్ సౌకర్యము టాయిలెట్ల సౌకర్యాన్ని కల్పించాలని ఒంటిమిట్ట మండల ప్రజలు మనవి చేస్తున్నారు

# ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తాం

జోనల్ హెడ్ శ్రీనివాసులు





**రాజంపేట, మేజర్‌న్యూస్ :** ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని యూనియన్ బ్యాంకు జోనల్ హెడ్ పత్రి శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాజంపేట పట్టణ కేంద్రంలో అమ్మవారి శాల వద్ద ఉన్న యూనియన్ బ్యాంకు ను ఆర్ఎస్ రోడ్డులో గల చేజర్ల కాంప్లెక్స్ లోకి మార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రాజంపేట పట్టణంలో ఏడాదికి సుమారు 600కోట్ల లావాదేవీలు జరుగుతున్న ఏకైక బ్యాంకు మన యూనియన్ బ్యాంక్ అన్నారు. రైతులకు, విద్యార్థులకు, వ్యాపారస్తులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మహి ళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని యూని యన్ బ్యాంక్‌లక్ష్యంఅన్నారు.అంతేకాకుండా ఖాతాదారు లకు ఏమైనా సమస్యలు ఉంటే కడప రీజినల్ కార్యాలయందృష్టికితీసుకురావాలన్నారు. అదే విధంగా కారు గృహ వ్యక్తిగత అవసరాల నిమిత్తం రుణ మంజూరు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి బ్యాంకు సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలోమున్సిపల్‌కమిషనర్ శ్రీనివాసులు, రీజినల్‌హెడ్ లక్ష్మీ తులసి బ్యాంకు మేనేజర్ అబ్దుల్ లతీఫ్‌బ్యాంకు సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.

# పేదవిద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేస్తే ప్రజలు క్షమించరు

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హెచ్చరిక



**వాల్మీకిపురం,మేజర్‌న్యూస్** : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో వైద్య విద్యను,వైద్యాన్ని పేదలకు దూరం చేస్తే ప్రజలు క్షమించరని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం వాల్మీకిపురం మండలంలోని జర్రావారి పల్లె పంచాయతీ వడ్డిపల్లె,అయ్యవారిపల్లెలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్దేశించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పేదలు,గ్రామీణ ప్రాంతాల పిల్లలకు వైద్య విద్యను,ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేయించారని,అయితే కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు ఈ మెడికల్ కళాశాలలను సంతలో సరుకులు అమ్మినట్లు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో పేదలకు మెరుగైన వైద్యం,గ్రామీణ విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగామారుతుందన్నారు.అంతేకాకుండా కూట మి ప్రభుత్వం వచ్చాక రైతులు పండించిన వరి, టమోటా,మామిడి,బొప్పాయి,ఉల్లి తదితర పంట లకు గిట్టుబాటు ధరలు లేక ఆర్థికంగా తీవ్రంగా చితికిపోయారని,కుటుంబాలు పోషిస్తున్న పాలధం లు కూడా పతనమై రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించడంలోనూ కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.ఏడాదిన్నర కాలంలోనే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకుప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ సభ్యుడు చింతల శివానందరెడ్డి,వైసీపీ బీసీ విభాగం అధ్యక్షుడు నీళ్ల భాస్కర్,మండల వైసీపీ అధ్యక్షుడు పులి శివారెడ్డి, కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు అబ్దుల్ కలీమ్, కె.నరసింహులు,టీఏసీసభ్యుడుశ్రీధర్ రాయల్, గ్రామ కమిటీల అధ్యక్షులు చిన్నోడు ఎల్లారెడ్డి, సర్పంచులు జయచంద్ర,రెడ్డప్ప రెడ్డి, మాజీ సర్పంచులు చంద్రశేఖర్,నాగార్జున,సురేష్ కుమార్ రెడ్డి,నాయకులు ఆనంద్,రవి,రఘు,రాజబాబు, రాయుడు,చలపతి,శ్రీరాములు,రమణ,మోహన్ రెడ్డి,శేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నెలసరి అంటే అంటరానితనం కాదు,అమ్మతనం

▪ హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబక్కర్ సిద్దిక్ వెల్లడి ▪ గుర్రంకొండ జూనియర్ కళాశాలలో శానిటరీ ప్యాడ్ బ్యాంక్ ఏర్పాటు



**మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** గుర్రంకొండ జూనియర్ కళాశాలలో గురువారం శానిటరీ ప్యాడ్ బ్యాంక్ హెల్పింగ్ మైండ్స్ బృందం ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ నెలసరి/పీరియడ్స్ అనేది సహజమైన ప్రక్రియ అంటూ ఆసమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలతోపాటు,అపోహలు తొలగిస్తూ,ఇంట్లో పాతచీరలు లాంటివి నెలసరికి వాడటం వల్ల ఎన్నోరకాల ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని గుర్రంకొండ జూనియర్ కళాశాలకు రూరల్ ప్రాంతాల నుండి అమ్మాయిలు చదువు కోవడానికి వస్తూ ఉంటారు.వారికి అండగా శానిటరీ ప్యాడ్ బ్యాంక్ ఆరోగ్య సూత్రాలతోపాటు శానిటరీ ప్యాడ్స్ అందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి బాలయ్య,మహబూబ్ బాషా,అర్జున్ టీం సహకారం అందించారని తెలిపారు.తమ కళాశాల విద్యార్థినుల కోసం శానిటరి ప్యాడ్ బ్యాంక్ సహకారం అందించిన హెల్పింగ్ మైండ్స్ సేవలను కళాశాల యాజమాన్యం అభినందిం చింది.ఈ కార్యక్రమంలో గుర్రంకొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కమలాకర్,అధ్యాపకురాలు రమాదేవి,ఎన్.ఎన్.ఎస్ కో-ఆర్డినేటర్ జమీర్, డా.గంగాధర్,డా.అష్రఫ్,హెల్పింగ్‌మైండ్స్ గుర్రం కొండ ఇంచార్జిలు మొఖద్దర్,ఆబిద్,సంస్థ సభ్యులు తకి,మహమూద్,తయూబ్, వసీం, బాబజాన్,వజీద్ అలీ,సునీల్,సమీర్,అర్షియా,రాబియా పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో సామాన్యులకు లాభం..

ఆర్టీవో శివలింగయ్య..



**ములకలచెరువు,మేజర్‌న్యూస్** : ములకలచెరువు మండల కేంద్రంలో గురువారం మదనపల్లి ఆర్టీవో అధికారి శివలింగయ్య ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై మూడు రోడ్ల కూడలి నుండి జాతీయ రహదారి పెట్రోల్‌బంకువరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన జిఎస్టితో సామాన్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం 28% ఉన్న జీఎస్టీనిపదిపర్సెంట్ తగ్గించిన ట్లు తెలిపారు. దీంతో వాహనాల కొనుగోలుపై భారీగా జీఎస్టీ తగ్గినట్లు తెలిపారు. తగ్గిన జిఎస్టితో వాహనాల ధరలు తగ్గినట్లు తెలిపారు.అదే విధంగా నిత్యము ప్రజలు వాడే వస్తువుల పైన జిఎస్టి ప్రభుత్వం తగ్గించినట్లు తెలిపారు.దీంతో ప్రతి నెల ప్రజలకు భారం తగ్గి రూ: 15వేలుఆదాయంకలుగుతుందన్నారు.ఈఅవకాశాలను ప్రజలు సద్వినియో గం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్టీవో శ్రీహరి ఆటో డ్రైవర్లు రఫీ, బావాజీ, మస్తాన్, ఈశ్వర, మాబాషా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థులు ఎంపిక..



**ములకలచెరువు, మేజర్‌న్యూస్ :** ములకలచెరువు మండల కేంద్రంలోని స్థానికఆదర్శ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ కవిత తెలిపారు.ఈ మేరకు గురువారం రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరఫున జరిగిన అండర్ అండర్ –19 విభాగంలో హ్యాండ్ బాల్ పోటీల్లో పావని, నజ్మీన్లు, నెట్‌బాల్‌పోటీలోరెడ్డిప్రసన్న,లాంగ్ జంప్ విభాగంలో ఆరీఫ్ లు జిల్లాస్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయిక్రీడలలోఎంపికైనవిద్యార్థులుపాల్గొంటున్నట్లుప్రిన్సిపల్ తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికకు కృషిచేసిన ప్రిన్సిపల్ కవిత, ఫిజికల్ డైరెక్టర్ ముషీద్‌హుస్సేన్‌లనుపిల్లలతల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది అభినందించారు.

# గంగమ్మను దర్శించుకున్న యల్లటూరు

**రాజంపేట, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని కొత్త బోయినపల్లి గ్రామంలో శ్రీ గంగమ్మ దేవస్థానం నందు ఎంతో ప్రతిష్టాత్మకంగా శ్రీ గంగమ్మ జాతర ఉత్సవం నిర్వహించారు. ఈ జాతరకు నిర్వాహకులు, గ్రామస్తులు, స్థానిక జనసేన నాయకుల ఆహ్వానం మేరకు గురువారం జనసేన నేత యల్లటూరు శ్రీనివాస రాజు జాతర మహోత్సవంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజాకార్యక్రమంలోపాల్గొన్నారు. ఈ సందర్భంగా యల్లటూరు మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులుమేరువసుబ్బరాయుడు, మేడా జానకి రామయ్య, నల్ల బాబు, బొడిచెర్ల సుబ్బరాయుడు, పొట్టు శంకరయ్య, మేడా శ్రీకాంత్, ద్వారక మరియు రాజంపేట జనసేన నాయకులు, మాజీ జెడ్పిటిసి యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మౌలా, గాజుల కులాయప్ప, గూడూరు శ్రీనివాసులు, వెలిగండ్ల శ్రీనివాసరాజు, సాయిరాజు, సురేంద్ర పాల్గొన్నారు.



## సాయిబాబా శత జయంతి సందర్భంగా 150 మంది మహిళలకు ఒడిబియ్యం





**రైల్వేకోడూరు మేజర్ న్యూస్** : రైల్వేకోడూరు స్థానిక గిరిజమ్మ వీధిలో ఉన్న సత్య సాయి మందిరం నందు ఆయన శత జయంతి సందర్భంగా మహిళలకు 150 మందికి ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. అలాగే వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగినది స్వామివారి కృపతో. తదుపరిగా స్వామికి మహా మంగళహారతి సమర్పిం చడం జరిగినదని. సత్యసాయి సేవా సమస్త రైల్వేకోడూరు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు.

# సుండుపల్లి క్లస్టర్ -10కు మోహన్ బాబు ఏకగ్రీవం



**రాజంపేట, మేజర్న్యూస్ :** టీ సుండుపల్లి మండలం క్లస్టర్ -10కు ఏకగ్రీ వంగా ఎన్నికైన గోనిగుంట్ల మోహన్ బాబుకి టీడీపీ కార్యకర్తలు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు.ప్రజల విశ్వాసం, నాయకత్వ నైపుణ్యం, సేవా భావం పట్ల గౌరవ సూచకంగా ఈ ఏకగ్రీవ ఎన్నిక జరగడం నిజంగా గర్వకారణం. ప్రజల అండతో, అభివృద్ధి పట్ల నిబద్ధతతో మీరు ముందుకు సాగి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాం క్షిస్తు న్నామన్నారు. మోహన్ బాబు నాయకత్వం క్లస్టర్ -10 అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి మార్గదర్శకంగా నిలుస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.

## ఈనెల 19న రంగాని రామాంజులు సంస్మరణ సభ

### - అందరూ తరలిరావాలని కుటుంబ సభ్యుల ఆహ్వానం



**మదనపల్లె,మేజర్న్యూస్ :** మండలంలోని పొన్నీటిపాళ్యం పంచాయతీ, పనసమాకుల పల్లెకు చెందిన రంగాని రామాంజులు ఈనెల 8వ తేదీన స్వర్గస్తులయ్యారు.ఆయన సంస్మరణసభ19వతేదీ అనగా (ఆదివారం) నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారులు రంగాని రాజశేఖర్,రంగాని రాజ్ కుమార్, అల్లుడు బి.మురహరి నాయడు మరియు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ మంచికి మారుపేరుగా నిలిచిన రంగాని రామాంజులు మా నుండి దూరమైనప్పటికీ, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ మాతోనే ఉంటాయన్నారు. ఆయన సంస్మరణ సభను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామని,ఈ సభకు రాజకీయాలకుఅతీతంగాఅన్ని పార్టీల నాయకులు,పట్టణంలోని ప్రముఖులను ఆహ్వానించడం జరిగిం దన్నారు. అదేవిధంగా 19వ తేది మధ్యాహ్నం విందు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఇదే మా ఆహ్వానంగా భావించి సంస్మరణ సభకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు.

# బీవైఎస్ ఆధ్వర్యంలో కోమటివానిచెరువుపై రోడ్డుకు మరమ్మత్తులు

### అధికారులకు కనువిప్పు కలగాలని చురకలు



**మదనపల్లె,మేజర్న్యూస్ :** ప్రజల ప్రాణాలను, ప్రయాణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో కోమటివానిచెరువు రోడ్డు అధ్వాన్నంగా మారడాన్ని నిరసిస్తూ గురువారం బహుజన యువసేన నాయకులు రోడ్డు మరమ్మత్తు పనులను చేపట్టారు.ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కుమార్ మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్డుపై ప్రయాణించడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని,ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా,నిధులు లేవనే సాకులు చెప్పి,రోడ్డు మరమ్మత్తు విషయంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజల క్షేమం కోసం తమ యువసేన ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా కోమటివాని చెరువు రోడ్డును తాత్కాలికంగా పూడ్చే పనులను ప్రారంభించామనిపునీత్కుమార్తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలన్నారు.లేనిపక్షంలోమాయువసేన సభ్యులు, శ్రేయోభిలాషుల సహకారంతో సొంత నిధులతోనే ఈ రోడ్డుకు పూర్తి మరమ్మత్తులు చేస్తామని స్పష్టంచేశారు.అదేవిధంగా ప్రజలు అత్యంత రద్దీగా ప్రయాణించే బెంగళూరు నిమ్మనపల్లి రోడ్లను కూడా వెంటనే మరమ్మత్తు చేయించాలని,లేకపోతే ఆ రోడ్ల పనులను కూడా మేము మరమ్మత్తులు చేపట్టడానికి వెనుకాడబోమని పునీత్ కుమార్ హెచ్చ రించారు.ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించి,అధికారులు తక్షణమే రోడ్డు మరమ్మత్తుల పట్ల చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు జిలాని భాష,రెడ్డి శేఖర్ రెడ్డి,హరికృష్ణ, వినయ్, ఆది,కర్ణ, లోకేష్, ఉదయ్, కుమార్, సాయికిరణ్,మనీష్,జగదీష్, సంతోష్, ఉమామహేశ్వర్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# దాతృత్వం చాటుకున్న ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు

### క్యాన్సర్ వ్యాధిగ్రస్తుడికి డాక్టర్ స్వాతి చక్రపాణి ఆర్థిక సాయం



**మదనపల్లె రూరల్,మేజర్న్యూస్ :** సమాజ సేవా కార్యక్రమాల్లో ధాత్రి ఫౌండేషన్ ముందు వరుసలో నిలుస్తోంది.ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ స్వాతి చక్రపాణి ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తోంది. చిన్న మండ్యం మండలం, కొండమూలకి చెందిన నాగయ్య క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నారు.విషయం తెలుసుకున్న ధాత్రి ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ స్వాతి చక్రపాణి గురువారం క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు నాగయ్యకి రూ.10 వేలు ఆర్థిక సాయంఅందజేశారు. ఈసంద ర్భంగా ఆమెమాట్లాడుతూఇప్పటికే నాగయ్యకు రెండు ఆపరేషన్లు చేయడంతో రూ.6లక్షలకుపైగా ఖర్చయింద న్నారు.అయినా వ్యాధి నయం కాలేదని కుటుంబ సభ్యుల ఆవేదన వ్యక్తం చేశారన్నారు. నాగ య్యదిసామాన్యరైతు కుటుంబ మని,పెద్ద ఆసుపత్రిలోచికిత్సచేయించేస్తోమత ఆ కుటుంబానికి లేదని,దీంతో తిరుపతిలో ఉన్నటు వంటి టాటా హాస్పిటల్ నందు క్యాన్సర్ జబ్బుకు మెరుగైన చికిత్స కలదని అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ప్రస్తుతంనాగయ్యకిదాతలసహకారంఅవసరం ఉందన్నారు. సాయంచేయవలసిన దాతలు ఎవరైనా ఉంటే 8186099919 అనే మొబైల్ నెంబరును సంప్రదించి తమవంతు ఆర్థిక సాయం అందించవచ్చునన్నారు.

# హ్యాండ్ బాల్ పోటీలలో మదనపల్లె విద్యార్థినుల ప్రతిభ

- అండర్ -19 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక
- అభినందించిన ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి



**మదనపల్లె టౌన్,మేజర్న్యూస్ :** మదనపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుండి అన్నమయ్య జిల్లాలో జరిగిన అండర్ -19 విద్యార్థుల క్రీడాపోటీలలో హ్యాండ్ బాల్ విభాగంలో సెకండియర్ విద్యార్థినులు సిఇసి కుసుమ ,సెరికల్చర్ నవ్య తేజ,ఎంపీసీ రోహిణిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు.స్టేట్ లెవెల్ పోటీలకు పిడి మురళీధర్ రెడ్డి ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని అందించడం జరుగుతుందని కళాశాలలో మూడు రోజులుగా విద్యార్థుల ఆధార్ అప్డేషన్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతున్నదని వెల్లడించారు. కళాశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలను తొలగించి వాటి స్థానంలో పూల మొక్కలను,ఇతర మొక్కలను నాటేకార్యక్రమాన్ని లెక్చరర్ బాలరాజు ఆధ్వర్యంలో విద్యార్థులుశ్రమదానకార్యక్రమం చేపట్టారు. రానున్న పబ్లిక్ పరీక్షలకు అవసరమైన ముఖ్యమైన ప్రశ్నలనువాటికిసంబంధించిన విశ్లేషణ,జవాబులు రాసే విధానాన్ని ప్రత్యేకంగా చేపట్టి విద్యార్థినులకు శిక్షణ ప్రారంభించడం జరిగింది.అన్నమయ్య జిల్లాలో గత మూడు సంవత్సరాలుగా పరీక్షా ఫలితాలలో,క్రీడలలో విద్యార్థినులు మొదటి స్థానంలో నిలవడానికి చర్యలు చేపట్టి ఫలితాలు రాబట్టడం జరిగిందని ప్రిన్సిపాల్ వెల్లడించారు.



# జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఉపశమనం : పీలేరులో అవగాహన ర్యాలీకి విశేష స్పంద



**పీలేరు మేజర్న్యూస్ :** పీలేరు పట్టణంలో గురువారం నాడు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి. విజయ కుమారి ఆధ్వర్యంలో "జీఎస్టీ తగ్గింపు పై అవగాహన ర్యాలీ" ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, వాహన డీలర్లు, డ్రైవర్లు, వ్యాపారులు, ప్రజలు విస్తృతంగా పాల్గొన్నారు.మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం నుండి పీలేరు క్రాస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించబడింది. ఈ సందర్భంగా పాల్గొన్నవారు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. "జీఎస్టీ తగ్గింపు -ప్రజలకు ఉపశమనం", "సుస్థిర రవాణా - సమగ్ర అభివృద్ధి" వంటి నినాదాలు ర్యాలీని ఆకర్షణీయంగా మార్చాయి.ర్యాలీ అనంతరం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో అవగాహనసమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ పురం రామ్మూర్తి హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వం వాహన రంగంపై ఉన్న పన్ను భారాన్ని తగ్గించే దిశగా జీఎస్టీ సడలింపులు చేయడం, డ్రైవర్లు మరియు చిన్న వ్యాపారుల జీవనోపాధికి ఊతమిస్తుందని" అన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలనిఆయనసూచించారు.ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి. విజయ కుమారి మాట్లాడుతూ, "జీఎస్టీ తగ్గింపుతో వాహనాల రిజిస్ట్రేషన్, బీమా తదితర వ్యయాలు తగ్గుతాయి. ప్రజలు చట్టబద్ధంగా వాహనాలు నడపడం ద్వారా రోడ్డు భద్రతను కాపాడాలి" అని తెలిపారు. అలాగే, ఎంపీడీవో శివశంకర్, జీఎస్టీ ఆఫీసర్ శివయ్య కూడా మాట్లాడుతూ, "ప్రభుత్వం తీసుకొస్తున్న ఆర్థిక సడలింపులను ప్రజలు సమర్థంగావినియోగించుకోవాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ టీం సభ్యులు ఏ. చందన జ్యోతి, సి.వి.ఏ.పి.యు టీం సభ్యులు టి. శ్వేత, ఎం. స్వాతి, బి. విష్ణు ప్రియ, బి. లీల పాల్గొన్నారు. అలాగే ఆటో యూనియన్ నాయకుడు చాంద్ భాషా (చాను), టు వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ డీలర్లు, యజమానులు, ఆటో డ్రైవర్లుపెద్దసంఖ్యలోహాజరైకార్యక్రమాన్ని విజయవంతంచేశారు.పట్టణవ్యాప్తంగా ర్యాలీ సందర్భంగా ప్రజల్లో చైతన్యం నెలకొంది. జీఎస్టీ తగ్గింపుతో సాధారణ వాహనదారులకు ఆర్థికంగా ఉపశమనం కలగనుందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.



# ప్రేక్షకుల మనస్సును హత్తుకునేలా రూపొందిన చిత్రం"విధాత"

▪ అన్నివర్గాలను ఆకట్టుకునే కుటుంబ కథాచిత్రం ▪ చిత్రనిర్మాత,కథానాయకుడు డాక్టర్ అప్పిన పల్లి భాస్కరాచారి వెల్లడి



**మదనపల్లె,మేజర్‌న్యూస్ :** ప్రతి ప్రేక్షక హృద యాన్ని "విధాత" చిత్రం హత్తుకునే విధంగా ఏబిసి ప్రొడక్షన్స్ అధినేత,చిత్ర నిర్మాత,చిత్ర కథానాయ కుడు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కిందని పేర్కొన్నారు.ఇంటిల్లిపాది వీక్షించే కుటుంబ కథాచిత్రంగా చరిత్రలో నిలుస్తుం దన్నారు.మదనపల్లి నటులకు చిత్ర పరిశ్రమలో విధాత చిత్రంతో గుర్తింపు తెస్తుందన్నారు.సుమారు 50 మంది నటీనటులు వారి అద్భుత ప్రతిభకు ఈ చిత్రం అద్దంపడుతుందని చెప్పారు.ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి ప్రచారంపైన ప్రత్యేక దృష్టి సారించారు.మొదటిసారిగా మదనపల్లి నేపథ్యంలో చిత్ర నిర్మాణం జరుపుకోవడంతో పాటు, నిర్మాత, దర్శకులు,కథా రచయిత ఇక్కడి వారే కావడం ఈ చిత్రం విజయం సాధిస్తుందనడంలో అతిశయోక్తి కాదు.ఇప్పటికే విధాత చిత్రంపైన ప్రజల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.ఇందులో భాగంగా అతిత్వరలో ప్రేక్షక దేవుళ్ళ ముందుకు రాబోతోంది. ఇందుకుగాను మిగిలిన పనులు శరవేగంగా పూర్తిచేస్తున్నారు.ఈ చిత్రం ద్వారా మదనపల్లికి చెందిన కళామతల్లి ముద్దు బిడ్డలకు అవకాశాలు మెరుగు పడతాయనడంతోపాటు,తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు తెచ్చుకోగలరని విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఈచిత్రం పూర్తి కుటుంబ కథాచిత్రమైన ప్రేక్షకులకు ఎక్కడ బోరు కొట్టే అంశాలు లేకుండా చిత్ర యూనిట్ అన్ని జాగ్రతలు తీసుకుంది.ఈ చిత్రం అధికారికంగా సినిమా థియేటర్లలో విడుదలచేయడానికి అన్ని అనుమతులను ఇప్పటికే పొందిందని విశ్వసనీయ సమాచారం.అతి త్వరలో వెండితెరపై ప్రదర్శనకుగాను దర్శక నిర్మాతలు పూర్తిస్థాయిలోచర్యలుచేపట్టారు.ప్రతి కుటుంబంలో జరిగే సంఘటనలను తెర మీద చూపించిన విధా నం,సరి కొత్తగా ఉంటుందని తెలుస్తోంది. కథలో దమ్ము ఉంటే బాక్స్ ఆఫీస్ ముందు దుమ్ములేపిన చిత్రాలు అనేకం ఉన్నాయి.అదేవిధంగా విధాత చిత్రం మంచి కథ బలంతో ప్రేక్షకుల ముందుకు రాబోతోందనడంలో ఎటువంటి సందేహం లేదు.



# నిర్లక్ష్యం...పొంచి ఉన్న ప్రమాదం



**చిట్వేలి, మేజర్‌న్యూస్ :** ఒకవైపు వర్షం పడుతుంది మరోవైపు అధిక లోడుతోమొక్కలు వేసుకొని వీధుల్లో వెళుతుంటే ఇటు మధ్యకాలంలో కరెంటు వైర్లు తెగిపడగా ప్రమాదాన్ని గుర్తించి కరెంటును ఆఫ్ చేసిన సంఘటన అందరికీ తెలిసిందే. ప్రతిరోజు ఇదే తంతు ఓవర్ లోడ్ తో లారీలు పోతున్న ఎవరూ పట్టించుకోవడంలేదని చిట్వేలి పట్టణ ప్రజల ఆవేదన. శుక్రవారం రాత్రి, సింగనమాల వీధిలో అధిక లోడు కర్రలు వేసుకుని లారీ వెళుతున్న సమయంలోకరెంటుతీగలు అనుకొని స్తంభాలు ఊగాయి. సంఘటన చూసిన ఆ ప్రాంతంలో నివాసముంటున్న ప్రజలు అరుపులు కేకలు పెట్టే లోపల వేగాన్ని తగ్గించి ఈగలను పైకి లేపి లారీని ముందుకు పంపించారు. ఒకవైపు వర్షం పడుతుంటే ఒక్క కరెంటు తీగ తెగి కింద పడ్డ ఎంతమందికి ప్రమాదం జరుగుతుందోఅధికారులైనాగుర్తించాలనిపోలీసులను ప్రజలు మొరపెట్టుకుం టున్నారు.రాబోయేది వర్షాకాలం రాత్రి సమయంలో లారీలు ఇస్టానుసారంగా పోవడం వలన ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చిట్వేలి పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా చిట్వేలి పోలీసు అధికారులు అధికారులు వచ్చే లారీలపై దృష్టి పెట్టి కరెంటు వైర్లు స్తంభాలు విరిగిపడకుండా ప్రమాదాలకు గురికాకుండా చూడాలని వేడుకుంటున్నారు.

# జీవన ఎరువుల వాడకంపై రైతులు చొరవ చూపాలి

– కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల



**కలికిరి మేజర్‌న్యూస్:** జీవన ఎరువుల వాడకంపై రైతులుచొరవ చూపాలని కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో జీవన ఎరువుల వాడకంపై చర్చ, అవగాహన శిక్షణా కార్యక్రమం కె.వి.కె సమన్వయకర్త డాక్టర్ కె . మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగాఆమె మాట్లా డుతూ జీవన ఎరువులైన అజోల్లా,రైజోబియం,అజటోబాక్టర్, ఫాస్పేట్‌సాల్యు బులైజింగ్ బ్యాక్టీరియా, పొటాషియం విడుదల బ్యాక్టీరియా వంటి వాటిని పంట పొలాల్లో ఉప యోగించిపంటకుఅవసరమైన నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను అందించవచ్చునని తెలిపారు. డా.కె విశ్వనాథ్, ప్రధాన శాస్త్రవేత్త తెగుళ్ల విభాగం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి వారు మాట్లాడుతూ అజోస్పైరిల్లమ్ జీవన ఎరువు వరిలో పనిచేసే విధానాన్ని, రైజోబియంను వేరుశనగ మరియు అపరాల పంటల్లో వాడడం ద్వారా నత్రజని పంటలకు అందుతుందని తెలిపారు. ఫాస్పేట్ సాల్యుబలైజింగ్ బ్యాక్టీరియా ద్వారా వేరు వ్యవస్థకు భాస్వరంఅందుతుందని, భూమిలోఉన్న పొటాషి యం మొక్కలకు అందేటట్లు బ్యాక్టీరియా సహకరిస్తుందని సూచించారు. పైవన్నీ ఎకరాకు 500 మి.లీ డ్రిప్పు ద్వారా లేదా 200 కిలోల పశు వుల ఎరువులో కలిపి ఆఖరి దుక్కిలో వేసు కోవాలని తెలిపారు. కెవికెలో పశువుల ఎరువులో జీవన ఎరువులైన రైజోబియం, అజటోబాక్టర్ మరియు జీవశిలీంద్రనాశినులైన ట్రైకోడెర్మా మరియు సూడోమోనాస్ కలిపి డెమో చేసి చూపించారు. కెవికెలో సేంద్రీయ వ్యవసాయం ద్వారా వరి పంట సాగు చేయడంలో పాటించిన వివిధ సేంద్రియ పద్ధతుల గురించి సమన్వయకర్త డా: కె.మంజుల వివరించారు. తదుపరి కెవికె క్షేత్రంలోని కోత దశలో ఉన్న సేంద్రీయ వరిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పి. రామకృష్ణరాజు, కెవికె శాస్త్రవేత్తలు ఎస్. సోమశేఖర్ బాబు, డా: కె.మాధురి, డా: వై. పీరు సాహెబ్, డా: ఏ. శ్రీనివాసులు, కెవికె సిబ్బంది , రైతులు మరియు తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంపిడిఓ కార్యాలయం ముందు చిన్న చెరువే...?




**తంబళ్లపల్లె, మేజర్‌న్యూస్ :** తంబళ్లపల్లె మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట తేలికపాటి వర్షాలకే నీటిమడుగు ఏర్పడుతోంది. కార్యాలయంలో లోపలికివెళ్లడానికిఅధికారులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఈ సమస్యపై అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. ఇప్పటికైనా అధికారులుస్పందించిమండలఅభివృద్ధి నిధులతో ఈ సమస్య పరిష్కరించాలని అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

# కల్తీమద్యంతో మద్యపాన ప్రియుల ప్రాణాలకు ముప్పు

▪ పిపిపి విధానానికి వ్యతిరేకంగా రచ్చబండ,కోటి సంతకాల సేకరణ ▪ వైసిపి నియోజకవర్గం ఇంచార్జి నిస్సార్ అహమ్మద్ వెల్లడి

**మదనపల్లె రూరల్,మేజర్‌న్యూస్ :** మదనపల్లె నియోజకవర్గంలో గడప,గడపకు వెళ్ళి కల్తీ మద్యంపైన ప్రజలకు అవగాహన,మెడికల్ కాలేజీల పిపిపి విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టడం జరుగుతుందని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ వెల్లడించారు.గురువారం మదనపల్లె నియోజకవర్గం,రామసముద్రం మండలంలో వైసిపి నాయకులతో నిస్సార్ అహమ్మద్ సమావేశమ య్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో చేపట్టే రచ్చబండ,కోటి సంతకాల సేకరణపై సమావేశమై నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.రామసముద్రం మండలంలో నిర్వహించే రచ్చబండ,కోటి సంతకాల సేకరణలో స్థానిక నాయకుల అభిప్రాయం మేరకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు.మెడికల్ కాలేజీల పిపిపి విధానానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టి కూటమి ప్రభుత్వాన్ని దోషిగా నిలుపుతామన్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు,మాజీ ముఖ్య



మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,రాజంపేట పార్లమెంటు సభ్యులు పి.వి.మిథున్ రెడ్డి,అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు మదనపల్లె నియోజకవర్గంలో ఇంటింటికి కూటమి పాలన వైఫల్యాలు తీసుకెళ్లడం జరుగు తుందని తెలిపారు.చంద్రబాబు నాయుడు సిఎం అయిన తరువాత మెడికల్ కాలేజీలను పూర్తి చేయడానికి మనసు రావడం లేదని,జగన్మోహన్ రెడ్డి అన్నిసదుపాయాలు సమకూర్చినా మనసులో పేదలపై కక్ష పెంచుకున్నారని విమర్శలు చేశారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలు పూర్తిచేయడం పెద్ద కష్టమేమీ కాదని,పీపీపీ వల్ల తన మనుషులకు లాభం చేకూర్చాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచనని,ఇప్పటికే ఐదు మెడికల్ కాలేజీలను తన మనుషులకు పీపీపీలో అప్పచెప్పారని ఆరోపిం చారు.ఆ కాలేజీల భూములను తాకట్టు పెట్టి వాళ్ళు డబ్బు తెచ్చుకోవడం,ప్రజలు మళ్లీ ప్రైవేట్ ఆసుపత్రులకు పోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైన ప్రభుత్వం తన వైఖరిమార్చుకుని,పిపిపివిధానానికి స్వస్తి పలకాలని సూచించారు.నవంబర్ 25న జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో గవర్నరుకు కోటి సంతకాలను అంద జేస్తామన్నారు.మేధావి వర్గాలు,ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు సంతకాల సేకరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.కల్తీ మద్యం సేవించి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని విమర్శలు చేశారు.కల్తీ మద్యంపైన గడప,గడపకు వెళ్ళి ప్రజలను చైతన్యవంతం చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు తెలియ జేయడంలో వైసిపి నాయకులు,కార్యకర్తలదే ముఖ్య పాత్ర అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూపర్ జి ఎస్టీ అమలు చేయాలి

**సుండుపల్లె మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ల్యాబ్‌లలో సూపర్ జి ఎస్టీని అమలు చేయాలని హెల్త్ సూపర్వైజర్ సదా శివరెడ్డి, ఏఎన్ఎంలు నీలిమ, అంజనమ్మలు నిర్వాహకులకు సూచించారు. గురువారం మండల కేంద్రమైన సుండుపల్లెలోని తిరుమల, రియా, మురళి ల్యాబ్‌లలో సూపర్ జి ఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గతంలో అమల్లో ఉన్న జి ఎస్టీతో పోలిస్తే సూపర్ జి ఎస్టీ విధానం మార్పు లను వివరించారు. ల్యాబ్‌లకు వచ్చే ప్రజలకు కూడా దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# నూతన వైజ్ఞానిక ఆలోచనలను జనింపజేసే కౌశల్ పోటీలు : 2025



**రాయచోటి,మేజర్‌న్యూస్ :** భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ మరియు ఏపీ కాస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు - 2025 నిర్వహిస్తోంది. కౌశల్ - 2025 పోస్టర్లను ఆవిష్కరిస్తూ "ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో కౌశలాలను పెంపొందించడానికి కౌశల్ పోటీలు ఉపకరిస్తాయి" అని అన్నమయ్య జిల్లా డీఈవో కె. సుబ్రహ్మణ్యం అన్నారు. అన్నిప్రభుత్వ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపళ్ళు తప్పనిసరిగా పాఠశాల కోఆర్డినేటర్ల చేత 8, 9, మరియు 10 తరగతుల విద్యార్థులను ఈనెల అనగా అక్టోబర్ 24, 2025 వ తేదీ లోపల రిజిస్టర్ చేయించాలి. ఈ పోటీలు మూడు విభాగాలలో మరియు మూడు స్థాయిలలో జరుగుతాయి. అవి 1. క్విజ్ 2. పోస్టర్ 3. రీల్స్ .పాఠశాల స్థాయి, జిల్లాస్థాయి ల్లో ఆన్లైన్ విధానం లోనూ రాష్ట్రస్థాయిలలో ప్రత్యక్ష విధానంలో జరుగుతాయి. పోటీలు జరిగే ముఖ్యమైన తేదీలు పాఠశాల స్థాయి : 8వ తరగతి: నవంబర్ 1 9వ తరగతి: నవంబర్ 3 10వ తరగతి: నవంబర్ 4 జిల్లా స్థాయి8వ తరగతి , 9వ తరగతి : నవంబర్ 27 10వ తరగతి: నవంబర్ 28 రాష్ట్ర స్థాయి ఈవెంట్ భారతీయ విజ్ఞాన సమ్మేళన్ 2025లో భాగంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో డిసెంబర్ 27,2025న జరుగుతుంది. జిల్లాస్థాయి రీల్స్, పోస్టర్-1 మరియు పోస్టర్- 2 బహుమతులు 1. ప్రథమ బహుమతి :1,500/- 2. ద్వితీయ బహుమతి : 1,000/- రాష్ట్రస్థాయి బహుమతులు 1. ప్రథమ బహుమతి : 5,000/- 2. ద్వితీయ బహుమతి : 3,000/- 3. తృతీయ బహుమతి :2,000/- క్విజ్ బహుమతులు జిల్లా స్థాయి : 1. ప్రథమ బహుమతి - 4,500 2. ద్వితీయ బహుమతి - 3000 రాష్ట్ర స్థాయి :1. ప్రథమ బహుమతి - 15000 2. ద్వితీయ బహుమతి - 12000 3. తృతీయ బహుమతి - 9000 రాష్ట్రస్థాయిలో కన్సోలేషన్ బహుమతులు రూ. 1,500/-చొప్పున నగదు బహూకరించబడును. పోస్టర్ - 1 అర్హత - 8వ తరగతి వికసిత భారత్ కోసం సుస్థిర మరియు హరిత ఇంధన వనరులు పోస్టర్ - 2 అర్హత - 9వ తరగతి సత్యేంద్రనాథ్ బోస్ జీవితం మరియు ఆయన చేసిన కృషి రీల్స్ అర్హత - 10వ తరగతి ఆంధ్ర వైజ్ఞానిక వైభవం (సంప్రదాయ విజ్ఞానం, ప్రాచీన - ఆధునిక శాస్త్రవేత్తలు, వైజ్ఞానిక సంస్థలు) గ్రామీణవిద్యార్థుల ప్రతిభను అన్వేషించడానికిఉత్తమశాస్త్రీయఆలోచనలను ప్రోత్సహించడానికి ఈ వేదిక ఉపయోగపడు తుంది అని జిల్లా సైన్స్ ఆఫీసర్ మార్ల ఓబుల్ రెడ్డి అన్నారు. విజ్ఞాన శాస్త్రంలో భారత దేశం ప్రఖ్యాతిగాంచేలా గొప్ప శాస్త్రవేత్తలను అందించడానికి ఈ కౌశల్ పోటీలు ఉపయోగపడతాయని కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ మధుమతి అన్నారు. నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ భారత్ సేంద్రీయ వ్యవసాయంపై విద్యార్థుల్లో అవగాహన కలిగి దేశాన్ని ఆ దిశగా నడిపించే వారిగా తయారు చేయడానికి ఈ పోటీలు ఉపకరిస్తాయని కౌశల్ జాయింట్ కోఆర్డినేటర్ అయిన మలిశెట్టి వెంకట రమణఅన్నారు. పాఠశాలరిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, సిలబస్‌పూర్తి వివరముల కొరకు ఈ క్రింది వెబ్సైట్‌నుక్లిక్ చేయండి www.bvmap.org కౌశల్ పోటీలకు సంబంధించి ఇతర సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్లు 1. టి. మధుమతి 8985541699 జిల్లా కోఆర్డినేటర్, అన్నమయ్య జిల్లా 2. ఎమ్. వెంకట రమణ 9949520704 జిల్లా జాయింట్ కోఆర్డినేటర్, అన్నమయ్య జిల్లా

# కార్తీకమాసానికి ముస్తాబవుతున్న శివాలయాలు

- కొండ కోనల నడుమ వెలసిన కర్కాటేశ్వ రా ఆలయం
- నెల రోజులపాటు కార్తీక మాసం పూజలు



**చిట్వేలి, మేజర్‌న్యూస్ :** హిందువులకు అత్యంత భక్తి పరమైన మాసంగా కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాలు ముస్తాబ్ అవుతున్నాయి. ఇందులోభాగంగా ముఖ్యంగా కార్తీక మాసంలో అయ్యప్ప మాలలు వేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. శివాలయాలు దర్శనార్థం భక్తుల తాకడి అధిక సంఖ్యలో ఉంటుంది కనుక ఆలయ నిర్వహకులు శివాలయాన్ని నూతనంగా రంగవల్లులు దిద్దుతూ ఆలయాలకు రంగులువేస్తూముస్తాబు చేస్తున్నారు. కొండ కోనల మధ్య వెలసిన కర్కాటేశ్వర ఆలయం అడవి తల్లి ఒడిలో ఉన్న విధంగా జలపాతాల నడుమ ఆలయం దర్శనమిస్తుంది. ప్రత్యేకంగా భక్తులకు కర్కాటక రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చే మహాభాగ్యం అక్కడ మాత్రమే దొరుకుతుంది. అత్యంత పురాతనమైన ఆలయాలు చిట్వేలి మండలంలో ఉన్నందున విశేష శిల సంపద ఆలయాలకు ప్రతిరూపాలుగామారాయి. భక్తులసౌకర్యార్థం అన్ని శివాలయాలలో ఏర్పాటుకు అన్ని సమకూ రుస్తున్నారు. భక్తుల తాకడిని దృష్టిలో పెట్టుకొని ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా చేపట్టారు. భద్రకాళి సమేత వీరభద్ర స్వామి, ఆలయం భువనేశ్వరి శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామి, ఆలయం లో నెలరోజులపాటు విశేష పూజలు నిర్వహిస్తారు. ఉభయ దాతలు ఇచ్చే అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఆలయ నిర్వహకులు తెలియజేశారు.

# కిషన్ స్మార్ట్‌ను ప్రారంభించిన ముక్క వరలక్ష్మి

## ఏదోటి వెంకటేశ్వర్లను అభినందించిన నాయకులు



**చిట్వేలి మేజర్‌న్యూస్ :** రైతులను దృష్టిలో పెట్టుకుని అలుపెరగని పోరాట యోధుడిలా శ్రమించి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ రైతుల కోసం అహర్నిశలు కృషిచేసి ఈ స్థాయికి వచ్చిన ఏదోటి వెంకటేశ్వర్ల, చేపట్టిన నూతన కిసాన్ స్మార్ట్ భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. చిట్వేలిమండలపరిధిలోని గద్దలరేవుపల్లి గ్రామ సమీపాన చిట్వేలి కోడూరు ప్రధాన రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన నూతన కిసాన్ స్మార్ట్ భవనాన్ని కూడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి, సతీమణి ముక్క వరలక్ష్మి, కూటమి నాయకులతో కలిసి శుక్రవారం, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అభివృద్ధి సాంకేతిక ప్రగతి లక్ష్యంగా తీసుకున్న ఈ కొత్త ప్రయత్నం గ్రామీణ వ్యవసాయ రంగానికి దోహద పడుతుందన్నారు. అన్ని రంగాలతో పాటు వ్యవసాయ రంగంలో కూడా టెక్నాలజీ అభివృద్ధి చెందడం రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. నూతన ప్రయోగాత్మన్ని చేపట్టి రైతులను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి వి ప్రారంభించడం డాక్టర్ వెంకటేశ్వర్లు, వంటి వారు సమాజానికి ఎంతో అవసరమని ఆమె వెల్లడించారు. రైల్వే కోడూరు నియోజకవర్గానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అందరికీ అందుబాటులో కిషన్ స్మార్ట్ ను ప్రారంభించడం అభినందించదగ్గ విషయమని ఆమె కొని ఆడారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వచ్చిన అతిథులకు ముఖ్య నాయకులకు ఏదోటి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు అందరికీ స్వాగతం పలికి పుష్పగిత్యాలతో శాలువాలు కప్పి సత్కరించారు. అందరితో మీటింగ్‌హాల్లోరైతులపై చర్చించారు. గృహప్రవేశం పూజా కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ అన్నమయ్య కళావేదికను ప్రారంభించిన అన్నమయ్య జిల్లా ఉప విద్యాశాఖ అధికారి



**రాజంపేట, మేజర్‌న్యూస్ :** రాజంపేట పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో సుమారు రెండు లక్షల రూపాయల ఖర్చుతో దాతల సహకారంతో "శ్రీ అన్నమయ్య కళావేదిక " నిర్మించారు. ఈ వేదికను గురువారం అన్నమయ్య జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఎల్ .నాగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభా కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె జయలక్ష్మి గారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప విద్యాశాఖ అధికారి నాగయ్య మాట్లాడుతూ సమర్థవంతమైన హెడ్మాస్టర్ పాఠశాలలో ఉంటే ఈ విధంగా పాఠశాల అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. ఈ వేదిక నిర్మాణానికి ఆర్థికంగా సహకరించిన దాతలు విశ్వనాథ్ నాయుడు , బి .అచ్యుత, ఏ. రమణయ్య, వీర ప్రసాద్ గార్లను జిల్లా విద్యాశాఖ అధికారి ఘనంగా సన్మానించారు. సభా కార్యక్రమం అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజనాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ .నాగయ్య పరిశీలించారు. భోజనం బాగుందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంఈఓ-1 కే. రఘునాథ రాజు. ఎంఈఓ 2 డి. సుబ్బరాయుడు, పుల్లంపేట ఎంఈఓ జి చక్రధర్ రాజు పాఠశాలలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# పటాసుల విక్రయంపై నిబంధనలు తప్పనిసరి

## అతిక్రమిస్తే కఠిన చర్యలు చిట్వేలి ఎస్సై జి నవీన్ బాబు



**చిట్వేలి, మేజర్‌న్యూస్ :** దీపావళి పండుగ నేపథ్యంలో బాణాసంచా విక్రయాలు ఊపందుకున్న నేపథ్యంలో పటాసులు అమ్మే దుకాణా దారులు ప్రభుత్వం విధించిన నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని వాటిని అతిక్రమించే పని చేస్తే కఠిన చర్యలు తప్పవని చిట్వేలి మండల ఎస్సై జి నవీన్ బాబు, వెల్లడించారు. గురువారం,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణాసంచా విక్రయించే ప్రతి వ్యాపారుడు తాసిల్దార్, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారుల అనుమతితోపాటుఅవసరమైనలైసెన్స్ తప్పనిసరిగా పొందాలని సూచించారు. నిర్మానుష ప్రాంతాల్లో మాత్రమే దుకాణాలు పటాసుల దుకాణాలను జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కాకుండా ఊరికి దూరంగా ఉన్న నిర్మానుషమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రజలకు భద్రత దృష్ట్యా ఇది అత్యంత ముఖ్యమని వివరించారు. ప్రతి దుకాణంలో నీరు ఇసుక అగ్నిమాపక సౌకర్యాలు అందుబాటులో ఉండాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘనకు లైసెన్స్ రద్దు ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా బాణాసంచా విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే వారి లైసెన్సు్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అధిక ధరలకు అమ్మకూడదు పటాసుల ధరల్లో అధిక లాభాల ఆశతోప్రజలనుమోసం చేయడం వంటి ప్రవర్తనను సహించబోమని ప్రామాణిక ధరలకే విక్రయాలు జరగాలనిదుకాణదారుల కు సూచించారు. ప్రజలు కూడా అధిక ధరలకు కొనుగోలు చేయవద్దని అటువంటి దుకాణాలపై అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలందరూ దీపావళిసురక్షితంగాప్రశాంతంగా జరుపుకోవాలని పిల్లలు పెద్దలు పర్యవేక్షణలోనే బాణాసంచా కాల్చాలని ఎస్సై నవీన్ బాబు, ప్రజలకు తెలియజేశారు. దుకాణ దారుల్లో వర్తిక లేకపోవడం ఒకరికొకరు దుర్భాషలాడుకోవడం తగదన్నారు. చట్టపరంగా పటాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

– అధికారులు నాయకులు సమన్వయంతోనే మండల అభివృద్ధి – ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి




**కలికిరి మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యలే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల అభివృద్ధి సమస్యల పై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల నాయకులను గ్రామాల వారీగా పిలిపించి ఆయా గ్రామాల సమస్యలపైన సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యంగా మండలంలోని భూముల రీ సర్వే పైన, విద్యుత్ సమస్యల పైన ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయని ఆయన సంబంధిత అధికారులను హెచ్చరించి మూడు నెలల లోపు సమస్యలన్నీ పూర్తి చేయాలని డిటి సైద్ భాష, ట్రాన్స్కో డి ఇ చంద్రశేఖర్ రెడ్డి ఏడిఈ శివయ్య లను ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ శాఖలో ట్రాన్స్ఫార్మర్లు, కరెంట్ లైన్లు మార్చడం కోసం రైతుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పిర్యాదులు వచ్చాయని, అలాంటి చెడ్డ పేరు మండలంలో తేవద్దండని హెచ్చరించారు. అన్ని గ్రామాలలో డ్రైనేజ్ కాలువలు, వాటర్ ట్యాంకులు, గ్రామాలకు త్రాగునీటి బోరు, మోటర్లు వంటి సమస్యలుఎమ్మెల్యేవద్ద నాయకులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికిరి తమ సొంత మండలం అని ఈ మండలంలో అధికారులు ఎలాంటి అవినీతి కి పాల్పడవద్దని ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవడానికి అధికారులు నాయకులతో సమన్వయంగా ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనిఅన్నారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ మండల ప్రజలు వెన్నుదన్నుగా ఉన్నారని అలాంటివారికిమాసహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, వారి సమస్యలే పరిష్కారంగా మేము కృషి చేస్తామే తప్ప వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల మాదిరిగా ప్రజలకు ఇబ్బందులు పెట్టమని, ఎవరి భూములు అన్యాయంగా లాక్కోమని, ఎవరిపైన దౌర్జన్యాలు చేయడం, అక్రమంగా కేసులు పెట్టడం వంటి సంస్కృతి వారికి లేదని, నియోజకవర్గ మండలాల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తామని దీనికి అధికారులందరూ సహకరించి నియోజకవర్గం, మండలానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. వాటర్ గ్రిడ్ పనులు కింద 2000 కోట్లు నిధులు మంజూరు అయిందని, వాటితో నియోజకవర్గం లోని అన్ని మండలాలకు త్రాగునీరు అందుతుందని, కలికిరి పట్టణానికి ఝరికోన ప్రాజెక్టు నుండి ఇప్పుడు ఉన్న పైపులైన్ రిపేర్ చేయించి మళ్లీ నీరు అందేటట్లు పనులు మొదలు పెడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సహకార బ్యాంకు చైర్మన్ నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీకర రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి, జంగమ సంక్షేమ సంఘం చైర్మన్ చంద్రశేఖర్, యోగేష్ రెడ్డి, సహదేవ రెడ్డి, సతీష్ రెడ్డి, నాగభూషణం రెడ్డి, రమేష్ బాబు, ట్రాన్స్కో డి ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏడిఈ శివయ్య, ఎంపీడీవో భానుమూర్తి రావు, డిటి సయ్యద్, అన్ని గ్రామాల సర్పంచులు, సచివాలయసిబ్బంది, మండల స్థాయి అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిసెంబర్‌లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

– సీపీఐ(ఎంఎల్ )లిబరేషన్ కేంద్ర పోలీస్ బ్యూరో సభ్యులు శంకర్




**రాయచోటి ప్రతినిధి, మేజర్‌న్యూస్ :** డిసెంబర్‌లో జరిగే సిపిఐ( ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సిపిఐఎంఎల్ లిబరేషన్ కేంద్ర పోలిట్ బ్యూరో సభ్యులు వి శంకర్ అన్నారు గురువారం స్థానిక రాయచోటి ఎన్జీ హెంలో రాయలసీమ ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పొలిట్ బ్యూరో సభ్యులువి శంకర్ రాష్ట్ర కార్యదర్శి బంగార్రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్ కిరణ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ మతతత్వ మనువాద శక్తులను ప్రతి కటిద్దాం అన్నారు సమానత్వం. శోభ్రాతత్వం ప్రజాస్వామ్యం వర్ధిల్లే ప్రజల ఆంధ్రప్రదేశ్ను నిర్మిద్దాం అన్నారు. మన రాష్ట్రంలో అభివృద్ధి సంపద సృష్టి సంక్షేమం చేస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చిన డబల్ ఇంజన్ సర్కారు అభివృద్ధికి నేడు ఆమడ దూరంలో ఉంది అని విమర్శించారు. హామీలు ఇచ్చిన బాబు ప్రస్తుతంసంపదనుకార్పొరేట్‌సంస్థలకు ఇచ్చే కార్యక్రమంలో ఉన్నారని చెప్పారు. ప్రజా సంపద అయిన లాభాల్లో నడుస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పచెప్పడానికితీవ్రప్రయత్నంచేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. గతంలో గంగవరం పోర్టును మత్స్యకారులు పై కాల్పులు జరిపి మరియు ఆదాని కంపెనీకి అప్ప చెప్పారని వారు గుర్తు చేశారు. బాక్సట్ గనులను జిందాల్ కంపెనీకి కడప గనులను మిట్టల్ కంపెనీకి అప్పచెప్పు తున్నారని వారు అన్నారు. సూపర్ సెక్స్ సూపర్ ప్లాప్ గా మిగిలింద న్నారు. మతోన్మాద శక్తులకు దన్నుగా ప్రోత్సాహం అందిస్తూ అధికార వర్గమే కార్యక్రమాలు చేపడుతుందన్నారు. డిసెంబర్ 6 7న సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర మహాసభలో కడప నగరంలో జరుగుతున్నాయని ఈ మహాసభలకు ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాలని ప్రజలకు వారు పిలుపునిచ్చారు.



# డివిజన్ ఎస్‌జిఎఫ్ క్రీడల ఎంపికలపై సమావేశం




**రాజంపేట, మేజర్‌న్యూస్:** జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాఠశాల రాజంపేట యందు గురువారం రాజంపేట డివిజన్ ఎస్ జి ఎఫ్ క్రీడల ఎంపికల సంబంధించి వ్యాయమ ఉపాధ్యాయుల మరియు మండల కో ఆర్డినేటర్ ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి రాజంపేట డివిజన్ ఉప విద్యాధికారి నాగయ్య అధ్యక్షత వహించడం జరిగింది. రాజంపేట డివిజన్ లోని ఏడు మండలాలు అయినటువంటి నందలూరు రాజంపేట పుల్లంపేట ఓబులవారిపల్లి కోడూరు పెనగలూరు చిట్వేలి మండలాలలో ఎంపిక అయినటువంటి క్రీడాకారులకు డివిజన్ స్థాయిలో ఎంపికలు నిర్వహించి రాజంపేట డివిజన్ టీమును ఎంపిక చేయడం జరుగుతుంది అలాగే అండర్ 14 మరియు అండర్ 17 బాలుర మరియు బాలికలకు ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాట్మెంటన్, చెస్, యోగా మరియు అథ్లెటిక్స్ ల యందుఎంపికలునిర్వహించబడును..ఈ సమావేశం నందు డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నాగయ్య డీఎస్సీ 2025 నందు వ్యాయామ ఉపాధ్యాయులుగాఎన్నికై వివిధ పాఠశాలలో పనిచేస్తున్నటువంటివ్యాయామఉపాధ్యాయులను పరిచయం చేసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్‌స్థాయిపోటీలను విజయవంతం చేయడానికి వివిధ కమిటీలను ఏర్పరచుకొని డివిజన్ స్థాయి పోటీలను నిష్పక్షపాతంగా ప్రతిభను అనుసరించి మంచిటీమునుఎంపికచేయవలసినదిగా వ్యాయామ ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు.. రాజంపేట మండల విద్యాశాఖ అధికారులు లు రఘునాథ రాజు మరియు సుబ్బరాయుడు మరియు పుల్లంపేట మండల విద్యాధికారి చక్రధర్ రాజుగారు క్రీడాకారులకు అన్యాయం చేయకుండా బాగా నైపుణ్యం కలిగినటువంటి క్రీడాకారులు మాత్రమే ఎంపిక చేయవలెనని తెలియజేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల రాజంపేట ప్రధానోపాధ్యాయులు జయ లక్ష్మమ్మ డివిజన్ స్థాయి క్రీడలకు తమ పాఠశాలలో ఆతిథ్యం వహించడం తమకు ఆనందంగా ఉందని ఎటువంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా వ్యాయామ ఉపాధ్యాయులు అందరూ కలిసికట్టుగా ఈ క్రీడలనువిజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చినటువంటి కోఆర్డినేటర్లు మరియు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది



## మాలాధారణ భక్తులకు అన్నసంతర్పణ ప్రారంభం



**సుండుపల్లి మేజర్‌న్యూస్ :** అయ్యప్ప గోవింద మాలాధారణ భక్తులకు ప్రతి రోజు మధ్యాహ్నం మండల కేంద్రంలోని విరూపాక్ష చెన్నకేశవ శివఆలయం లో అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు గత కొన్ని సంవత్సరాలుగా దాతల సహాయంతో మాలాధారణ భక్తులకు మధ్యాహ్నం అన్నసంతర్పణ భిక్ష ఏర్పాటు చేస్తున్నారు అందులో భాగంగానే ఈ ఏడాది గురువారం నుండి భక్తులకు అన్న సంతర్పణ భిక్ష ఏర్పాటు చేశారు గురువారం తిరుమల మందుల షాపు నిర్వాహకులు రమేష్ కుటుంబ సభ్యులచే అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు కావున అయ్యప్ప గోవింద మాలాధారణ స్వాములు ప్రతిరోజు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని గురు స్వాములు కోరారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరికృష్ణ గురుస్వాములు ధనుంజయ రెడ్డి వెంకట్ నాగులు నిర్వాహకులు రెడ్డప్ప నాయుడు భగీరథరెడ్డి జెసిబి రాజా రెడ్డయ్య రాజు చంద్రమౌళి పలువురు భక్తులు పాల్గొన్నారు

# కాపు రాక్స్ ఆధ్వర్యంలో కృష్ణదేవరాయల వర్ధంతి

చిట్వేలు నుండి కదిలి వెళుతున్న బలిజలు



**చిట్వేలి,మేజర్‌న్యూస్ :** ఎంతోచరిత్ర కలిగిన కృష్ణదేవరాయలు ఆయన వర్ధంతిని పురస్కరించుకొని రాజంపేట, కాపు రాక్స్ ఆధ్వర్యంలోకృష్ణదేవరా యల వర్ధంతిని అంగరంగ వైభవంగా పాత బస్టాండ్‌లో నిర్వహిస్తున్న సందర్భంగా చిట్వేలు నుండి శని వారం, ఉదయం పయనం అవుతు న్నారు. కాపురాక్స్ ఆహ్వానం మేరకు చిట్వేలి మండల బలిజలే కాక రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉన్న బలిజ సంఘం నాయకులం దరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటు న్నారు. అందరూ పాల్గొని కృష్ణదేవ రాయలకు నివాళులర్పించాలని బలిజ సంఘంనాయకులు పిలుపునిచ్చారు.

## వ్యాపారి శ్రీకాంత్ అదృశ్యం ఉదంతం విషాదాంతం

– యాతాలవంక వద్ద లభించిన మృతదేహం



**మదనపల్లె రూరల్,మేజర్‌న్యూస్ :** మదనపల్లెలో వ్యాపారి శ్రీకాంత్ అదృశ్యం మిస్టరీ వీడకపోవడంతో కథ కంచికేనా అనే ఆరోపణలు వెలువెత్తాయి. మదనపల్లె కమ్మగడ్డవీధి ఎక్స్టెన్షనులో నివాసముంటున్న శ్రీకాంత్ (50) స్థానిక చిత్తూరు బస్టాండులో గాయత్రి మెడికల్ స్టోరును నిర్వహిస్తున్నాడు. కాగా వ్యాపార నిమిత్తం అప్పులు ఎక్కువైన నేపథ్యంలో ఒత్తిడి భరించలేకపోతున్నాను. అమ్మను బాగా చూసుకోండని తన ఇద్దరు కుమారుల సెల్ ఫోన్లకు మెసేజీలు పెట్టి సెప్టెంబర్ 27న షాపును మూసేసి వెళ్లిపోయాడు. బెంగళూరు రోడ్డు,చిప్పిలి హంద్రీ – నీవా కాలువ పక్కన తన బైకును వదిలి అదృశ్యమయ్యాడు. నీటిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడా అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. అగ్నిమాపక అధికారులు శ్రీకాంత్ మృతదేహం కోసం హంద్రీ – నీవా కాలువలో గాలింపు చేపట్టినా ఫలితం దక్కలేదు. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా,పుంగనూరు మండలం,ఈడిగపల్లి యాతాలవంకలో గురువారం శ్రీకాంత్ మృతదేహం బయటపడింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు,పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తుపట్టారు. ఈ మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# డబుల్ ఇంజన్ సర్కారుతో ఏపీలో అభివృద్ధి డబుల్ స్పీడ్

- దేశానికి మోదీ,రాష్ట్రానికి చంద్రబాబు ఒక వరం
- సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ సభ సూపర్ సక్సెస్
- రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్



**మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్** : డబుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రంలో జెట్ స్పీడుతో అభివృద్ధి జరుగుతోందని రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు.గురువారం నిమ్మనపల్లి సర్కిల్ నందు గల టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ రాయలసీమ ప్రాంతానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.రాయలసీమలోని పుణ్యక్షేత్రాల గురించే కాకుండా ప్రజల గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారన్నారు.భారత దేశానికి ప్రధానమంత్రిమోదీ,ఏపీకిముఖ్యమంత్రిచంద్రబాబు ఒకవరం లాంటివారన్నారు.వారు ప్రతి నిత్యం అభివృద్ధి కోసం పరితపిస్తున్న నాయకులని కొనియాడారు.అలాంటి ఇద్దరు గొప్పనాయకులతో కలిసి ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉండారాన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేష్ కృషితో గూగూల్ ఏఐ డేటా సెంటరును విశాఖకు తీసుకొస్తున్నారన్నారు.ఈ సంస్థ రాకతో ఏపీకి ప్రపంచ పటంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు.రానున్న రోజుల్లో ప్రధాన మంత్రి సహకారంతో రాష్ట్రంలోమరిన్నిఅద్భుతమైనప్రాజెక్టులు వస్తాయని ఆర్.జె.వెంకటేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.కర్నూలులో జరిగిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ సభసూపర్సక్సెస్ అయిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ నాయకులు గట్టు చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటరెడ్డిపల్లె రచ్చబండ కార్యక్రమంలో ధ్వజారెడ్డి



**రైల్వే కోడూరు రూరల్ మేజర్ న్యూస్ :** రైల్వేకోడూరుమండలంలోగురువారం వెంకటరెడ్డిపల్లిలో ఎన్ వి ఎస్ గిరిజన కాలనీ లో సాయంత్రం గ్రామ ప్రజలతో పాటు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం ఆంధ్ర రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా వెంకటరెడ్డి పల్లి గిరిజన ప్రాంతంలో వైసీపీ నాయకులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి నాయకులు అందరితో కలిసి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంత సమస్యలు గురించి ముఖాముఖి చర్చలు జరిపారు.వారికి కొన్ని సదుపాయాలు లేవు అని ఆయనకు తెలిపారు. ఆయన వారికి సంబంధించిన సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ పాలెం కోట రత్నమ్మ కు శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలెం కోట రత్నమ్మ చంద్ర,స్థానిక సర్పంచ్ హరికృష్ణ రెడ్డి , కోడూరు సర్పంచ్ శివయ్య దార్ల చంద్రశేఖర్ ఆనాల చెంగల్రెడ్డి దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు రమేష్ మాజీ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు గునిశెట్టి రమేష్ నాగేంద్ర మహేశ్వర రెడ్డి గనీ రామకృష్ణ జై శంకర్ రెడ్డి ఆర్ వి రమణ ఆనంద్ కొప్పల శ్రీనివాసులు బత్తల సుబ్రహ్మణ్యంమాజీ జడ్పీ టీసీ శ్రీనివాసులు ఫరూఖ్ శ్రీరాములు గిరిజన గ్రామస్తులు కార్యకర్తలు అభిమానులు తదితరులు భారీగా పాల్గొన్నారు.



# రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల ఆగమనం

**రైల్వే కోడూరు రూరల్ మేజర్ న్యూస్** : రాష్ట్రంలో దక్షిణ భారతదేశంలోకి ఈశాన్య రుతుపవనాల ప్రవేశించి నున్నట్లు ఐఎండీ పేర్కొంది.ఈ సమయంలో ప్రతి దినం నైరుతి రుతుపవనాలు పూర్తిగా నిష్క్రమిస్తాయని తెలిపింది.ఈ నేపథ్యంలో రెండు దినములు నుంచి ఆంధ్ర రాష్ట్రమంతటా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య కడప జిల్లాలోని భారీ వర్షాలు కురిసే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఏపిఎస్ డిఎంఎ పేర్కొంది.అక్టోబర్ 20 కు బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావం ఏర్పడే అవకాశం ఉన్నట్లు ఐఎండీ అంచనా వేసింది.అనంతరం అది వాయుగుండం లేదా తుపానుగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయని దాని వల్ల ప్రమాదం ఏర్పడనుందని అంచనా వేస్తున్నారు.దీని వల్ల రాష్ట్రంలోని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు

# పార్థివదేహానికి నివాళులర్పించిన గుట్టబాబు



**సుండుపల్లి మేజర్‌న్యూస్ :** సుండుపల్లి మండల పరిధిలోని వాయల్పాటి వాండ్లపల్లెకు చెందిన సాంబ అన్న దేవరింటి శ్రీనాథ్ యాదవ్ పార్థివదేహానికి టిడిపి బీసీ సాధికార సమితి పాల ఏకరి రాష్ట్ర కన్వీనర్ కోడూరు అబ్జర్వర్ గురిగింజకుంట శివప్రసాద్ (గుట్ట బాబు) నాయుడు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జనసేన రామ శ్రీనివాస్,రమణయ్య, కొండూరు రవీంద్ర రాజు,వేదుక చలపతి ముద్దుశెట్టి రామయ్య పాల్గొన్నారు.